MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 260 | పేజీలు : 8 | మంగళవారం 8 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



కీలక ప్రతిపాదనలకు

రక్షణ శాఖ పచ్చజెండా

- రూ.1.10 లక్షల కోట్లతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లు
- రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర
- ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు
- అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం



ప్రైవేటు రంగానికి

ప్రోత్సాహం

- ఇస్రో ఒక్కటే అది చేయలేదు
- కచ్చితంగా ప్రైవేటు భాగస్వామ్యం అవసరం
- భారత అంతరిక్ష రంగాన్ని విస్తరించడంలో పరిశ్రమల పాత్ర పెరగాలి
- ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ కీలక వ్యాఖ్యలు

నియోజకవర్గానికి రా.కో.టి

25 ప్రాధాన్యాంశాల్ని గుర్తించాలి
స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి
2029 ఎన్నికలపైనే నా ధ్యాస, ఆలోచన
తెదేపా ప్రజాప్రతినిధులకు సీఎం చంద్రబాబు స్పష్టీకరణ



అమరావతి, మహానగర్

చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న సానుకూలతను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లుగా మార్చేందుకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా నేతలు సమష్టిగా పనిచేయాలని స్పష్టంచేశారు. తెదేపా లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో సోమవారం ఆయన పార్టీ బలోపేతం, నియోజకవర్గాల అభివృద్ధిపై కీలక సూచనలు చేశారు. "నా ధ్యాస, ఆలోచన... 2029 ఎన్నికల్లో గెలుపుపైనే. 2024 కంటే మెరుగైన ఫలితాలు వస్తాయి. అందులో తిరుగులేదు" అని పేర్కొన్నారు. మూడు నెలలకోసారి ఇలాంటి లీడర్‌షిప్ కాంక్లేవ్‌లు నిర్వహిస్తామన్నారు. డబ్బు ఒక్కటే ఎన్నికల్లో గెలిపించదని, ప్రజలు, కేడర్‌తో బలమైన అనుబంధమే విజయానికి పునాది అని సీఎం తెలిపారు. నియోజకవర్గాల్లో చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన కోరగా... నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున ఇచ్చేందుకు సీఎం అంగీకరించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల్నీ సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీలు వారి పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యక్రమంలో నిధులు కేటాయించాలని తెలిపారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో 25 ప్రాధాన్యాంశాలను గుర్తించి, వాటి ఆధారంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం సూచించారు. "అలా పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు, గౌరవం లభిస్తాయి. మీరు నిత్యం ప్రజల్లో ఉంటూ, కేడర్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి" అని సీఎం సూచించారు. 2029 ఎన్నికల్లో విజయంపైనే తన ధ్యాస, ఆలోచన ఉన్నాయని ముఖ్యమంత్రి - మిగతా2లో

ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది

- ద్రవ్యోల్బణం పండుగల ఆనందాన్ని దెబ్బతీస్తోంది : కాంగ్రెస్ 5
- మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోందని జైరాం రమేశ్ ఫైర్



తాగునీటి కష్టాలకు చెక్

తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు 2



బాబూ.. జాబ్ ఎక్కడ?

కదంతొక్కిన పోలీసు అభ్యర్థులు
మెగా పోలీస్ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆందోళన..
కాకినాడలో నిరుద్యోగుల భారీ ప్రదర్శన

కాకినాడ/అమరావతి, మహానగర్

పోలీసు అభ్యర్థులు కాకినాడలో కదంతొక్కారు. బాబూ.. జాబ్ ఎక్కడ అంటూ సర్కారును నిలదీశారు. మెగా పోలీస్ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఢిల్లీ జెన్‌జీ ఉద్యమ తరహాలో మహోద్యమం తప్పదని హెచ్చరించారు. పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులు సోమవారం యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాకినాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. శారదా దేవి గుడి సర్కిల్‌కు చేరుకుని, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరుకు ప్రదర్శన నిర్వహించారు. కొడుకు లోకేశ్‌కు మంత్రి పదవి కట్టబెట్టిన చంద్రబాబూ.. మాకు జాబ్ ఎక్కడ అంటూ నిలదీశారు. తక్షణం మెగా పోలీసు నోటిఫికేషన్ విడుదల చేయాలి అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా సర్కారు తాత్సారం చేస్తోందని ధ్వజమెత్తారు. వయోపరిమితిపైనా అభ్యర్థులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలుని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామంటూ ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు హామీలు ఇచ్చారని, కానీ ఈ రెండేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని దుమ్మెత్తిపోశారు. పీజీలు, డిగ్రీలు చదువుకున్న తాము నిరుద్యోగులుగా మిగిలిపోతుంటే.. ఇంటర్ ఫెయిలైనవారూ ఈ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. - మిగతా2లో

క్రీడా కోటాలో అవకతవకల్లేవు



- డీఎస్సీ 2025 పారదర్శకంగా నిర్వహించాం
- టెట్ స్కోరు పెంచుకోవడానికి ఎన్నిసార్లయినా రాయొచ్చు
- స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఐదుగుర్నీ ఒకే స్కూలుకి వేస్తే తప్పేంటి?
- క్రీడా సంఘాల మధ్య వివాదంతోనే జూడో సర్టిఫికెట్ల సమస్య
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, శాప్ ఎండీ భరణి

అమరావతి

'మెగా డీఎస్సీ-2025పై గతంలో వచ్చిన ఆరోపణలు, ఎంపిక కాని అభ్యర్థుల అనుమానాలకు స్పష్టమైన ఆధారాలతో ఇప్పటికే సమాధానాలిచ్చాం. అయినా ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తూనే ఉన్నారు. డీఎస్సీ అత్యంత పారదర్శకంగా జరిగింది. స్పోర్స్ కోటాలో ఎలాంటి అవకతవకలు జరగలేదు. టెట్ స్కోరు పెంచుకోవడానికి ఎన్నిసార్లయినా రాయొచ్చు. వాటిలో అత్యధికంగా వచ్చిన మార్కుల్నే పరిగణనలోకి తీసుకుంటాం. క్రీడా సంఘాల మధ్య వివాదం వల్లే జూడో సర్టిఫికెట్ల విషయంలో సమస్య తలెత్తింది' అని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) మేనేజింగ్ డైరెక్టర్ భరణి స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం వారిద్దరూ కలిసి విలేకర్లతో మాట్లాడారు. డీఎస్సీపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలతో సమాధానా లిచ్చారు. 'డీఎస్సీపై దాఖలైన రిట్ పిటిషన్లపై హైకోర్టు విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. - మిగతా2లో

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ వరకు పార్టీ విధివిధానాలపై టీడీపీ ముఖ్య నేతల సమగ్ర చర్చ

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం



విజయవాడ, మహానగర్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ జిల్లా పార్టీ ఎన్నికల సమావేశంలో నాయకులు సమగ్రంగా చర్చించారు. నగరంలోని డీవీ మేనర్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో పార్లమెంటరీ పార్టీ ఎలక్షన్ ఇన్‌చార్జి మక్కెన మల్లికార్జునరావు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దా వెంకన్నతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలు, కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్ణయించారు. కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థి ఎవరైనా వారి విజయానికి పార్టీ శ్రేణులందరూ సమష్టిగా కృషి చేయాలని స్పష్టం చేశారు. వ్యక్తిగత అభిప్రాయాలకు అతీతంగా కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమన్వయంతో ఎన్నికల కార్యాచరణను అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించేలా ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించారు. గ్రామస్థాయి నుంచి పట్టణ, కార్పొరేషన్ స్థాయి వరకు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల విజయానికి అవసరమైన కార్యాచరణను అమలు చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో స్వశక్తిమంతులుగా ఎదగాలి

వై.కుమారస్వామి

స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో కృత్రిమ అవయవాల అందజేత



అగిరిపల్లి, మహానగర్

స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న హైటెక్ కృత్రిమ కాళ్లను వినియోగించుకొని దివ్యాంగులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని, ఇతరులపై ఆధారపడే స్థితి నుంచి స్వశక్తిమంతులుగా ఎదగాలని ఏపీ జెన్‌కో పవర్ విశ్రాంత ఇంజినీర్ల బృందం ప్రతినిధి వై.కుమారస్వామి అన్నారు. సోమవారం మండలంలోని తోటపల్లిలో ఉన్న హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో విశ్రాంత ఏపీ జెన్‌కో పవర్ ఇంజినీర్ల బృందం వితరణతో కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఐదుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ కృత్రిమ అవయవాల ద్వారా దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు వారు స్వయం ఆధారితంగా జీవించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ వివిధ సంస్థలు, దాతల సహకారంతో ఇప్పటివరకు 921 మందికి కృత్రిమ కాళ్లను అందజేసినట్లు తెలిపారు. మండవ వెంకటేశ్వరరావు, ఎం.సత్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆలేటి శ్రీహరి, ఏ.లక్ష్మీనారాయణ, ఆర్.ప్రభాకరరావు, జి.జనార్ధనరావు, జి.శ్రీరాములు, దివంగత జెన్‌కో ఇంజినీర్ కె.వి.ఆర్.ప్రసాద్ తరఫున ఆయన సతీమణి ఇందిరాదేవి, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, కృత్రిమ అవయవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలకు మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయం

ఆముదార్లంకలో దాదాపు రూ.కోటితో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



చల్లపల్లి, నంబర్ వన్

ఇబ్బందుల్లో ఉన్న గ్రామాలకు మౌలిక సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని ఆముదార్లంకలో సోమవారం దాదాపు రూ.కోటి నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. పల్లె పండుగ--1లో రూ.85.70 లక్షలతో 1.45 కిలోమీటర్ల మేర నిర్మించిన ఏడు సీసీ రోడ్లను, ఎస్సీ కాలనీలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9 లక్షలతో నిర్మించిన మంచినీటి పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృష్ణానదికి వరదలు వచ్చిన ప్రతిసారీ సహాయక చర్యలకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలోని అన్ని నదీగర్భ గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పల్లె పండుగ--1లో మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులతో ఆముదార్లంకలో రూ.85.70 లక్షలతో ఏడు సీసీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. ఈ గ్రామం భౌగోళికంగా బాపట్ల జిల్లాలో ఉన్నప్పటికీ ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి, మహాత్మా గాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్య సాధనకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పల్లె పండుగ--1లో మంజూరైన రూ.31.65 కోట్లతో నియోజకవర్గంలో 45.6 కిలోమీటర్ల మేర 462 సీసీ రోడ్లు నిర్మించినట్లు వివరించారు. పల్లె పండుగ--2 నిధులతో దాదాపు 15 కిలోమీటర్ల మేర తారు రోడ్లు నిర్మించగా, పల్లె పండుగ--3 నిధులతో రైతులకు కీలకమైన డొంక రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఐక్యత ఉంటే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆముదార్లంకలో రహదారుల నిర్మాణానికి ముందుండి సహకరించిన గ్రామ పెద్ద వేములపల్లి రాఘవేంద్రరావును ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం గ్రామానికి నూరు శాతం సీసీ రోడ్లు మంజూరు చేసి నిర్మించినందుకు గ్రామ పెద్దలు, టీడీపీ, జనసేన నాయకులు బుద్ధప్రసాద్‌ను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఆనందకుమారి, ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్ పైడిపాముల కృష్ణకుమారి, గ్రామ ప్రముఖులు, టీడీపీ, జనసేన నాయకులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వో మర్రి శ్రీదేవిపై వేధింపులు ఆపాలి

- కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్దన్



విజయవాడ, మహానగర్

ఏలూరు జిల్లా డీఆర్వో మర్రి శ్రీదేవి పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ డీఆర్వో మర్రి శ్రీదేవిని విధులు నిర్వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దామాషా ప్రకారం 25 శాతం ఉన్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పు కాపు, మున్నూరు కాపు వర్గాలకు చెందిన ఉద్యోగులు ఎలాంటి వేధింపులకు గురికాకుండా స్వేచ్ఛగా విధులు నిర్వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా డీఆర్వో మర్రి శ్రీదేవి పట్ల ఉన్నతాధికారి దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడినట్లు వచ్చిన కథనాలపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో శ్రీదేవి సెలవుపై వెళ్లడం పట్ల రాష్ట్ర కాపు జేఏసీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్వో మర్రి శ్రీదేవి తిరిగి విధులు సక్రమంగా నిర్వర్తించేలా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్, మంత్రి అనగాని సత్య ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చందు జనార్దన్ తెలిపారు.

క్రీడా కోటాలో అవకతవకల్లేవు

-మొదటిపేజీ తరువాయి

కోర్టు పరిధిలోని అంశాలపై మాట్లాడలేం. నిర్దిష్టమైన ఆరోపణలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే విచారణ చేయిస్తాం. కానీ కొన్ని మీడియా సంస్థలు తప్పుడు కథనాలు వేస్తున్నాయి. ఏకంగా తరగతి గదుల్లోకి వెళ్లి టీచర్లపై దాడులకు పాల్పడుతున్నారు. ఆధారాలు లేకుండా దొంగ సర్టిఫికెట్లని చెప్పడమేంటి? ఉపాధ్యాయుల పట్ల ఇలా అవమానకరంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం' అని వారు హెచ్చరించారు.

ప్రధానాంశాలివీ..

స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన 372 మందిని మీడియా పేరు ఉపయోగించి కొంతమంది ధ్రువీకరణ పత్రాలు చూపించకపోతే వార్తలు రాస్తామని ఫోన్‌లో బెదిరిస్తున్నారు. ఇలాంటి వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తాం. ఉపాధ్యాయులను విద్యార్థుల ముందు అవమానకరంగా మాట్లాడితే క్షమించం. ఏ ఉపాధ్యాయుడినైనా ఎవరైనా ఇబ్బంది పెడితే సమాచారం ఇవ్వండి. విద్యాశాఖ అండగా ఉంటుంది.

విశ్రాంత సైనికాధికారి కాలర్ పట్టుకుంటారా?

ఉపాధ్యాయ దినోత్సవమైన ఈ నెల 5న ఇద్దరు వ్యక్తులు కుప్పం నియోజకవర్గంలో మోడల్ ప్రైమరీ పాఠశాలలో తరగతి గదిలో పాఠాలు చెబుతున్న డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుడి (విశ్రాంత సైనికాధికారి) వద్దకు వెళ్లి ఆర్మీ గుర్తింపు కార్డు, సర్టిఫికెట్లు చూపించాలని ప్రశ్నించారు. మీరెవరు? మీకు ఎందుకు చూపించాలని అన్నందుకు ఆ ఉపాధ్యాయుడి కాలర్ పట్టుకుని విద్యార్థుల ముందే చాలా దురుసుగా ప్రవర్తించారు. దీనిపై ఒక ఛానల్ రిపోర్టర్, కెమెరామెన్ గణేశ్, శ్రీకాంత్‌లపై పోలీసు కేసు నమోదు చేయించాం. ఇలాంటివి మరికొన్నిచోట్ల జరుగుతున్నట్లు తెలిసింది.

బాబూ.. జాబ్ ఎక్కడ?

-మొదటిపేజీ తరువాయి

సర్కారు తక్షణం స్పందించకుంటే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యపై ఢిల్లీలో జెన్‌జీ చేపట్టిన ఉద్యమ తరహా పోరాట స్ఫూర్తితో చలో విజయవాడ పేరుతో మహోద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రాంబాబు, రాజేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. గంగా సూయిబాబు, అధిక సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి రూ.కోటి

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. "ముందుగా స్థానికసంస్థల ఎన్నికల్లో విజయభేరి మోగించి, ఆ తర్వాత వచ్చే సాధారణ ఎన్నికలకు బలమైన పునాది వేసుకోవాలి. స్థానికసంస్థల్లో మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీకి సమర్థులైన మహిళా నాయకులను గుర్తించాలి" అని సూచించారు.

విజన్ ప్లాన్ అమలుచేస్తే గెలుపు ఖాయం

స్వర్ణాంధ్ర విజన్-2047పై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు వాల్యూ యాడిషన్ చేయాలన్నారు. విజన్ ప్లాన్ అమలుచేస్తే అభివృద్ధే కాకుండా, ఎన్నికల్లో గెలుపూ సాధ్యమవుతుందని తెలిపారు. కేంద్రమంత్రులుగా ఒక శాఖను పర్యవేక్షిస్తున్నవారు అదే స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి చేయాలని సూచించారు.

తాగునీటి కష్టాలకు చెక్

తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఏడాది చివరినాటికి పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నెలలు, వారాల వారీగా విభజించుకుని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. తద్వారా పనుల్లో వేగం పెరిగి నిర్దేశిత గడువులోపు ప్రజలకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధారల కింద రూ. 2,370 కోట్లతో చేపట్టిన 'చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్' పనుల పురోగతిపై పవన్ సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం కోసం వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రతి పల్లెకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అధికారులు తెలుపుతున్నారు. కేంద్ర నిధులు ఉపయోగించుకుని జల్‌జీవన్‌మిషన్ ద్వారా ప్రతీ ఒక్కరి దాహార్తి తీర్చాలనే సంకల్పాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమరజీవి జలధార రూపంలో ముందుకు తీసుకెళ్తున్నారు. అత్యంత నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, 2024తో ముగిసిన జల్‌జీవన్‌మిషన్ గడువును 2028 వరకు పొడిగించారు. జల్‌జీవన్ మిషన్ 2.0 కింద దాదాపు రూ. 26,000 కోట్ల విలువ చేసే తాగునీటి ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్తున్నారు. అందులో మొదటి విడతగా రూ. 7,910 కోట్లతో 5 జిల్లాల పరిధిలో చేపట్టిన 5 మెగా వాటర్ గ్రిడ్ పథకాల్లో చిత్తూరు కూడా ఒకటి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్ఠాత్మక తాగునీటి సరఫరా పనులు చేపట్టినట్ల సంబంధిత అధికారులు వివరిస్తున్నారు. పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

మహీంద్రా నుంచి 'బ్లాజో ఐ-ట్రక్' ఆవిష్కరణ

విజయవాడ



మహీంద్రా గ్రూప్‌లో భాగమైన మహీంద్రా ట్రక్ అండ్ బస్ సరికొత్త హెవీ కమర్షియల్ ట్రక్ 'బ్లాజో ఐ-ట్రక్'ను ఆవిష్కరించింది. 'ప్రాఫిట్ కా రాకెట్' ప్రధాన వాగ్దానంతో రూపొందించిన ఈ ట్రక్ రవాణాదారులు, ఫ్లీట్ యజమానులకు పూర్తి బిజినెస్ సొల్యూషన్‌గా ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. అత్యుత్తమ ఇంధన సామర్థ్యం, హైపెర్ఫార్మెన్స్ పవర్‌ట్రైన్, స్మార్ట్ కనెక్టెడ్ టెక్నాలజీలు, అప్‌టైమ్ గ్యారెంటీ వంటి ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. బ్లాజో ఐ-ట్రక్ మూడు ప్రధాన కస్టమర్ భరోసాలతో రూపొందింది. 'ఎర్న్ మోర్'లో భాగంగా ఏఐ ఆధారిత 'ఐఫ్యూయెల్‌స్మార్ట్' ఆటో డ్రైవ్ మోడ్, 'టర్బోమ్యాక్స్' టర్బోచార్జర్, 'ఆప్టిఫ్యూయెల్' ఎయిర్ కంప్రెసర్ వంటి సాంకేతికతలతో 10 శాతం మెరుగైన ఇంధన సామర్థ్యాన్ని అందిస్తుందని పేర్కొంది. దీని ద్వారా ఐదేళ్లలో ఒక్కో ట్రక్‌పై రూ.15 లక్షల వరకు అదనపు లాభం పొందే అవకాశం ఉందని తెలిపింది. 'రన్ మోర్'లో భాగంగా 320 హెచ్‌పీ ఎమ్‌పవర్ ఇంజిన్, కమ్‌ఫిమ్యాక్స్ సస్పెండెడ్ సీట్, ఈజీక్రూజ్ క్రూయిజ్ కంట్రోల్, బ్లూటూత్ మ్యూజిక్ సిస్టమ్, విశాలమైన ఏసీ క్యాబిన్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. వాహనం అందుబాటులో ఉండేలా 48 గంటల అప్‌టైమ్ గ్యారెంటీని అందిస్తోంది. 48 గంటల్లో వాహనం రోడ్డుపైకి రాకపోతే రోజుకు రూ.10,000 చెల్లిస్తామని సంస్థ తెలిపింది. 'కంట్రోల్ మోర్'లో భాగంగా ఐమ్యాక్స్ 2.0 ద్వారా రియల్‌టైమ్ వెహికల్ ఇంటెలిజెన్స్, ప్రెడిక్టివ్ డయాగ్నోస్టిక్స్, డ్రైవర్ పర్యవేక్షణ, సర్వీస్ మేనేజ్‌మెంట్, వ్యాపార విశ్లేషణలు అందనున్నాయి. 250 కీలక విడిభాగాల లభ్యతకు 'పార్ట్స్ సహా గ్యారెంటీ'తో పాటు ఆరు, ఎనిమిదేళ్ల ఎమ్‌కేర్ ఏఎంసీలు, ఎక్స్‌టెండెడ్ వారంటీ ప్లాన్‌లు అందుబాటులో ఉంటాయని సంస్థ వెల్లడించింది.

ప్రపంచ మార్కెట్లో మన ఎంఎస్ఎంఈలు!

- పరిశ్రమల రాణింపునకు ఎగుమతులకు కొత్త ద్వారాలు
- 200కు పైగా ఎంఎస్ఎంఈలు.. 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు
- 100 ఎగుమతి ఒప్పందాలు, రూ.100 కోట్ల వ్యాపార అవకాశాలు లక్ష్యం
- ఏపీ రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- ఎంఎస్ఎంఈలను కొత్త అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ చేసేందుకు కృషి
- ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్



విజయవాడ, మహానగర్

రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు దేశీయ మార్కెట్లకే పరిమితం కాకుండా ప్రపంచ మార్కెట్లలో పోటీపడే స్థాయికి ఎదగాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామిక వాతావరణాన్ని బలోపేతం చేస్తూ 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' విధానంతో ఉద్యోగాలను కోరుకునే వారిని ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఏపీఎంఎక్స్‌డీపీ)లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈలను అంతర్జాతీయ ఎగుమతులకు సిద్ధం చేయడం లక్ష్యంగా విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం ఏపీ రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్--2026 ప్రారంభమైంది. ర్యాంప్ కార్యక్రమం స్ఫూర్తితో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండియా ఎస్ఎంఈ ఫోరం భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్‌తో పాటు అంతర్జాతీయ కొనుగోలుదారులు, రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ మార్కెట్లను చేరువ చేయడం, విదేశీ కొనుగోలుదారులతో ప్రత్యక్ష వ్యాపార సంబంధాలను ఏర్పరచడం లక్ష్యంగా రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో 200కు పైగా ఎంఎస్ఎంఈలు, 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. బుర్కినా ఫాసో, కామెరూన్, కోట్ డి ఐవరీ, ఘనా, జపాన్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, జాంబియా, జింబాబ్వే తదితర దేశాల నుంచి కొనుగోలుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, పెట్టుబడులు, అభివృద్ధి రంగాల్లో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు అంతర్జాతీయ కొనుగోలుదారులతో నేరుగా చర్చించి తమ ఉత్పత్తులకు కొత్త మార్కెట్లను అన్వేషించే అవకాశం లభిస్తోందన్నారు. ప్రపంచ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తుల నాణ్యత, ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్ ద్వారా కనీసం 100 ఎగుమతి ఒప్పందాలు, ఆర్డర్లు సాధించడంతో పాటు సుమారు రూ.100 కోట్ల మేర ఎగుమతి వ్యాపార అవకాశాలను సృష్టించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్ మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి కొనుగోలుదారులను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించడం ద్వారా రాష్ట్ర ఎంఎస్ఎంఈలకు కొత్త అంతర్జాతీయ మార్కెట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. కొనుగోలుదారులు, ఎంఎస్ఎంఈల మధ్య జరిగే చర్చలను వాస్తవ వ్యాపార ఒప్పందాలు, ఎగుమతి ఆర్డర్లు, దీర్ఘకాలిక అంతర్జాతీయ భాగస్వామ్యాలుగా మార్చడమే లక్ష్యమన్నారు. ఈ మీట్‌లో వ్యవసాయం--ఆహార ఉత్పత్తులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, వస్త్రాలు--దుస్తులు, ఎలక్ట్రానిక్స్--ఎలక్ట్రికల్స్, ఔషధాలు--ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, ఆరోగ్యం--వెల్‌నెస్, సౌర విద్యుత్ పరికరాలు, రసాయనాలు, ఆటోమొబైల్--ఆటో కాంపోనెంట్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు తదితర 11 ప్రాధాన్యతా రంగాలకు చెందిన సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఇండియా ఎస్ఎంఈ ఫోరం అధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు కేవలం ఉత్పత్తిదారులుగా కాకుండా ప్రపంచ మార్కెట్లలో పోటీపడగలిగే స్థాయి సరఫరాదారులుగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ కొనుగోలుదారులను నేరుగా విజయవాడకు తీసుకురావడం ద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునే అవకాశాన్ని సులభతరం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల ద్వారా తక్షణ ఆర్డర్లతో పాటు పునరావృత వ్యాపారం, భాగస్వామ్యాలు, దీర్ఘకాలిక మార్కెట్ సంబంధాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు ప్రధాన విజయరామ్, నీలపు విజయానంద రెడ్డి, నల్లపనేని మురళీమోహన్, చిన్న రాజు, బండారు రవికాంత్, సత్యనారాయణమూర్తి, ఎన్‌టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, అంతర్జాతీయ కొనుగోలుదారులు, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతో స్వర్ణాంధ్ర

జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ర్యాలీ

కార్యక్రమ విశిష్టతను చాటిచెప్పిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్:

పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతను ప్రజల దైనందిన జీవితంలో భాగంగా మార్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. స్వచ్ఛమైన పరిసరాలు, పరిశుభ్రమైన వాతావరణంతోనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరని పేర్కొన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజంతో పాటు స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ర్యాలీలో అధికారులు, సిబ్బంది ఫ్లకార్డులు, బ్యానర్లతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ 'ప్లాస్టిక్ కవరు వాడకు... ప్రాణాలను తీయకు' అంటూ నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పునర్వినియోగ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. 'తడి, పొడి చెత్త నుండి ఎరువు... చేస్తే ఉండదు బరువు' అంటూ చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. తడి చెత్తను సక్రమంగా వినియోగిస్తే సేంద్రియ ఎరువుగా మార్చుకోవచ్చని, తద్వారా చెత్త సమస్యను తగ్గించవచ్చని తెలిపారు. 'డ్రైన్లలో చెత్త వేయకు... దోమలకు ఇల్లు కట్టకు' అనే నినాదంతో డ్రైనేజీల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించి ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. 'పచ్చదనం... ప్రకృతి ధనం' అనే సందేశంతో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను నిర్దేశిత విధానంలో నిర్వహిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీవో సీతా మహాలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు లక్షల సీడ్‌బాల్స్‌తో పచ్చదనానికి బాట

పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

పచ్చదనం పెంపు, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత సాధించేందుకు ప్రజల భాగస్వామ్యం కీలకమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వన్ ఎర్త్--వన్ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సీడ్‌బాల్స్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. పచ్చదనం పెంపు, జీవవైవిధ్య పరిరక్షణ లక్ష్యంతో విద్యార్థులు, సంస్థ వాలంటీర్లు తయారు చేసిన 2 లక్షల సీడ్‌బాల్స్‌ను ఈ సందర్భంగా కలెక్టర్ అందజేశారు. సీడ్‌బాల్స్ ద్వారా ప్రకృతి పునరుత్పత్తికి, పచ్చదనం పెంపునకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం వన్ ఎర్త్--వన్ లైఫ్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులు, మహిళలు, యువతను పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో పర్యావరణ స్పృహ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం, పరిశుభ్రత, రీసైక్లింగ్ వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. అంతరించిపోతున్న దేశవాళీ విత్తనాలను సంరక్షించి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాంప్రదాయ విత్తన సంపదను భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే మైక్రో గార్డెనింగ్, మొక్కల పెంపకం, విత్తనాల సంరక్షణ, వ్యర్థాల విభజన, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలను పర్యావరణహిత జీవన విధానం వైపు నడిపించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. వన్ ఎర్త్--వన్ లైఫ్ ఫౌండర్ ఏలూరి లీలా కుమారి మాట్లాడుతూ నగరాల్లో పచ్చదనం పెంచడంతో పాటు ప్రతి ఇంటికీ పర్యావరణ పరిరక్షణను చేరువ చేయాలనే ఉద్దేశంతో తమ సంస్థ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. మిద్దె తోటలను ప్రోత్సహిస్తూ గృహిణులకు మిద్దె తోటల పెంపకం, ఇంటి వ్యర్థాలతో కంపోస్టు తయారీ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో 'ధన్వంతరి వనం' పేరుతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు కార్యక్రమం కాదని, ప్రతి కుటుంబం, విద్యార్థి, మహిళ తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన బాధ్యత అని లీలా కుమారి అన్నారు. ఈ సందర్భంగా 2 లక్షల సీడ్‌బాల్స్‌ను అనుకూలమైన కొండలు, అటవీ, బంజరు ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా వెదజల్లి సహజంగా విత్తనాలు మొలకెత్తేలా చర్యలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వన్ ఎర్త్--వన్ లైఫ్ వాలంటీర్ టీం సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి

ప్రతి ఒక్కరికీ విద్య అందాలి

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

అక్షరాస్యత వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సెప్టెంబరు 8న నిర్వహించనున్న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోజన విద్యాశాఖ రూపొందించిన గోడ పత్రికను సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదవడం, రాయడంతో పాటు నిత్య జీవితానికి అవసరమైన ప్రాథమిక జ్ఞానం, అవగాహన ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వయోజనుల్లో అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోగలరని తెలిపారు. అక్షరాస్యతను సామాజిక ఉద్యమంగా తీసుకెళ్లేందుకు అన్ని వర్గాల భాగస్వామ్యం అవసరమన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు విజయవాడ కేబీఎన్ కాలేజీ ఆడిటోరియంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతో పాటు వయోజన విద్యా కార్యక్రమాలపై ప్రజలకు వివరించేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, వయోజన విద్యాశాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలి

అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్:

ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు ఆయా కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని, అర్హులైన వారు ఈ నెల 16వ తేదీలోగా అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ధ్రువీకరణ ప్రక్రియను ఏడు పనిదినాల్లో పూర్తి చేసేలా కాలపరిమితిని నిర్ణయించినట్లు తెలిపారు. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్ పెన్షన్‌కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని రకాల పింఛన్లకు సాధారణంగా ఆధార్, రైస్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత వర్గానికి అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారుల వివరాలు, సహాయక పత్రాలు, సాధారణ అర్హత, ఇప్పటికే ఉన్న పెన్షనర్ల డేటాబేస్, భౌతిక ధ్రువీకరణ నివేదిక, ఈ-కేవైసీ వివరాల ఆధారంగా ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వాటిని మాత్రమే సిఫార్సు చేస్తారని పేర్కొన్నారు. అనంతరం దరఖాస్తులను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపిస్తామని, రాష్ట్రస్థాయిలో ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, ఆర్‌టీజీఎస్, సెర్ప్ ద్వారా తుది పరిశీలన పూర్తయిన తర్వాత అర్హత కలిగిన దరఖాస్తులపై పింఛన్ మంజూరుకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో ఇప్పటికే అర్జీ సమర్పించిన వారు కూడా తమ పరిధిలోని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

మళ్లీ మొదటికి నీటి పంచాయితీ

కృష్ణా జలాల్లో వాటాల విషయంలో కొట్లాడుకుంటున్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆరెస్ పార్టీల నేతలు.. అసలు విషయాన్ని పక్కన పెట్టి.. షాడో ఫైట్ చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నీటి వాటాలు ఉన్నా.. వాటిని వినియోగించుకునేందుకు తగిన ప్రాజెక్టులు ఏవని సాగునీటి నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ముందుగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. కేటాయింపుల మేరకైనా నీటిని నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నీళ్ల పంచాయితీ ఇంకా తెగలేదు. కృష్ణా జలాలపై తమ వాటాలపై ఇంకా ఎటూ తేలలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాలను తాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధ కృష్ణా బోర్డు ఆఫీసులో త్రిసభ్య కమిటీ భేటీ అయింది. కృష్ణా బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ రమేశ్‌బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నరసింహమూర్తి సమావేశం అయ్యారు. ఆగస్టు 25న జరిగిన సమావేశంలో చర్చలు కొలిక్కి రాకపోవడంతో బోర్డు సమావేశం వాయిదా పడిన సంగతి తెలిసిందే. తిరిగి శుక్రవారం మరోసారి బోర్డు సమావేశం జరిగినా.. ఎలా ఫలితం తేలకుండానే ముగిసింది. ఈ నెల చివరి వారంలో మరోసారి జరిగే కృష్ణా బోర్డు సమావేశానికి కేఆర్ఎంబీ చైర్మన్ బోర్డు అధ్యక్షత వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలోని నీటి నిల్వలను తాగునీటికే వినియోగించాలని మొదటిగా చర్చించారు. కృష్ణా బేసిన్‌లో ప్రజలకు ఎక్కువ భాగం తాగునీటిని సరఫరా చేయాలని, ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాలకు 50% వాటా కింద నీటిని విడుదల చేయాలని తెలంగాణ కోరింది. వచ్చే ఏడాది ఆగస్టు వరకు 200 టీఎంసీలు కేటాయించాలని కోరింది. తమ అవసరాలకు 104 టీఎంసీల కేటాయించాలని ఏపీ.. కృష్ణా బోర్డును కోరింది. ఏపీ, తెలంగాణలకు 66:34 నిష్పత్తిని అమలు చేస్తూ తక్షణమే తమకు 97 టీఎంసీల నీళ్లు విడుదల చేయాలని ఏపీ కోరింది. అయితే ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండడంతో 50 శాతం చొప్పున జలాలు కేటాయించాలని తెలంగాణ కోరింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నారని తెలంగాణ ఆరోపించింది. దీనిపై ఏపీ స్పందిస్తూ న్యాయబద్ధంగా వచ్చిన నీటి నుంచే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా తీసుకుంటున్నట్లు పేర్కొంది. అవసరం లేకున్నా.. తెలంగాణ శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి నీటిని దిగువకు వదులుతోందని పేర్కొంది. దానిని వెంటనే అడ్డుకోవాలని కోరింది. దీనికి తెలంగాణ స్పందిస్తూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ తరలిస్తున్న నీటిని వెంటనే నియంత్రణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో ఇరు రాష్ట్రాలు ఉమ్మడి జలాశయాల నుంచి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్ సూచించారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీటి విడుదలను ఏపీ నియంత్రించాలి. విద్యుదుత్పత్తికి నీటిని విడుదల చేయడాన్ని తెలంగాణ ఆపాలని కోరారని మినిట్స్‌లో తెలియజేశారు. పులిచింత, కేడీఎస్, తుంగభద్రతో సహా అనేక ప్రాజెక్టుల్లో, పెన్నా బేసిన్‌లో 80 టీఎంసీలు ఉన్నాయని తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఉమ్మడి జలాశయాల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని, ప్రస్తుతం ఉన్న నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకే కేటాయించాలని తెలంగాణ వాదించింది. హైదరాబాద్ మహానగరంతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని, ఉమ్మడి జలాశయాల నుంచి 200 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరింది. అలాగే పాత విధానం కాకుండా రెండు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిలో సమానంగా నీటిని పంపిణీ చేయాలని తెలంగాణ ఈఎన్సీ రమేశ్‌బాబు ప్రతిపాదించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తోందని, ఇటీవల ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కూడా అనుమతుల్లేకుండా జలాలను తోడేస్తోందని తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.తెలంగాణ డిమాండ్‌ను ఏపీ తీవ్రంగా తిరస్కరించింది. ప్రస్తుతానికి తక్షణ అవసరాల కోసం 97 టీఎంసీలను విడుదల చేయాలని కోరారు. తమ వాటా పరిధిలోనే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా నీటిని వాడుకుంటున్నామని స్పష్టం చేస్తూ.. తెలంగాణ డిమాండ్ చేసిన 200 టీఎంసీల కేటాయింపు సహేతుకం కాదన్నారు. పైగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం నుంచి అనవసరంగా దిగువకు నీటిని విడుదల చేస్తోందని, దీనిని తక్షణమే నిలువరించాలని ఏపీ ఫిర్యాదు చేసింది.పోతిరెడ్డిపాడు 19 టీఎంసీలు, చెన్నై తాగునీటి కోసం 15 టీఎంసీలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది అక్టోబరు వరకు 22 టీఎంసీలు తీసుకుంటామని ఏపీ చెప్పిందన్నారు. ఇప్పటికే 20 టీఎంసీలు వాడుకున్నారన్నారు. వెలిగొండ నుంచి కూడా వాడుకుంటూ.. ఇంకా పాత నిష్పత్తిలో నీటి కేటాయింపు కావాలని కోరడం సరికాదన్నారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఏపీకి 104 టీఎంసీలు కావాలని కోరామని ఏపీ ఈఎన్సీ నరహింమూర్తి తెలిపారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలనడం సరికాదన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు కోసం కర్ణాటక ప్రభుత్వం భూసేకరణ పనులు వేగవంతం చేసున్నా.. తెలంగాణ ప్రభు త్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో లేని నీటి వివాదాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని, ఆయన హయాంలో ఏపీ నాయకులు ఎందుకు ఇంత ధైర్యం చేయలేదని ప్రశ్నించారు. వరదలు లేని సమయంలో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడంలో ఆంతర్యమేందని నిలదీశారు. కాళేశ్వరం బరాజ్‌లు సురక్షితమేనని ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూఫీఆర్ఎస్ సంస్థలు స్పష్టత ఇచ్చిన తర్వాతైనా కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్‌చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలమూరు పంపులనూ ఆన్ చేయాలని కోరారు.సీఎం రేవంత్‌రెడ్డికి కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎద్దేవా చేశారు. జూరాల ప్రాజెక్టు సామర్థ్యం కేవలం 6.5 టీఎంసీలే కావడం వల్ల భీమా, నెట్టెంపాడు, ఆర్డీఎస్ కింద లక్షలాది ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలోనే వలసల జిల్లా పాలమూరు రూపురేఖలు మారాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ వచ్చాక పాలమూరు బిడ్డలు మళ్లీ వలసబాట పట్టే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యకం చేశారు.

మూడో దశకూ మారని 'సర్'



ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా... మీడియా సాక్షిగా ఎలాంటి అపకతవకలు బయట పడుతున్నా 'స్వచ్ఛమైన' ఓటర్ల జాబితా రూపకల్పన పేరిట ఎన్నికల సంఘం(ఈసీ) చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియలో మూడో దశ పూర్తయింది. ఈసారి 16 రాష్ట్రాలూ, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 36.73 కోట్లమంది ఓటర్ల జాబితా లను జల్లెడబట్టి 6 కోట్లమందిని తొలగించినట్టు ఈసీ ప్రకటించింది. ఈ ప్రక్రియకు తొలి దశలో వచ్చినంత వ్యతిరేకత మలి దశలో లేదు. న్యాయస్థానాలు ఏవో కొన్ని ఆదేశాలీయటం మినహా ప్రక్రియను ఆపింది లేదు. మొదటి రెండు దశలతో పోలిస్తే మూడో దశ పెద్దగా అభ్యంతరాలు లేకుండానే పూర్తయినట్టు లెక్క. మొత్తంగా ఈ మూడు దశల్లోనూ 13 కోట్లమంది గల్లంతయ్యారు. దానర్థం వీరంతా అసలే లేకుండా పోయారని కాదు. జాబితాలో లేనివారు అభ్యంతరాలు చెబితే... ఈసీ అడిగిన పత్రాలు సమర్పించుకుంటే మళ్లీ చోటు దక్కించుకునే చాన్స్ ఉండొచ్చు. కానీ ఆ పత్రాల కోసం దూర ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే ఓపిక ఉండాలి. అందుకు కావలసిన తీరిక, సహనం ఉండాలి. ఖర్చు పెట్టగలిగే స్థోమత ఉండాలి. వారం, పదిరోజులు పనికి వెళ్లకున్నా కుటుంబం గడుస్తుందన్న భరోసా ఉండాలి. ఇంత చేసినా వచ్చే ఎన్నికల్లో ఓటేసే యోగం దక్కుతుందని అనుకుంటే అమాయకత్వమే. బెంగాల్‌లో ఒక అక్షరం ఇటూ అటూ అయినా జాబితాల్లో చోటుదక్కని వారు లక్షల్లో ఉన్నారు. 'తార్కిక వ్యత్యాసాల' పేరిట జాబితాల నుంచి వీరందరినీ వెళ్లగొట్టగా, 38 లక్షలమంది 19 ట్రిబ్యునళ్ల ముందు అప్పీల్ చేసుకున్నారు. ఇందులో కేవలం 82,000 మందికి ఊరట దొరికింది. పరిష్కరించిన అప్పీళ్లలో 90 శాతం మందికి తిరిగి చోటు దక్కింది. కానీ ఏం ప్రయోజనం... రాబోయే ఎన్నికల్లో తప్ప వీరు ఓటేయలేరు. వేలాది కోట్ల రూపాయలు బ్యాంకుల్లో అప్పు తీసుకుని ఎగ్గొట్టే వారిపై దయ చూపి 'హెయిర్ కట్' పేరిట మాఫీ చేస్తారు. ఓటర్ల జాబితాలకు ఈసీ చేసే ఈ 'హెయిర్ కట్' నిరుపేదలతో నిర్దయగా వ్యవహరిస్తుంది. వారిని కష్టాలపాలు చేస్తుంది.

బిహార్‌లో 'సర్'పై విచారణ సందర్భంగా 'విపక్షాలు హడావుడి చేస్తున్నాయి... మరి స్వల్ప సంఖ్యలో మాత్రమే అభ్యంతరాలు ఎందుకొస్తున్నా'యని ధర్మాసనం ప్రశ్నించింది. సహేతుకమైన సందేహమే. కారణాలనేకం. తమ ఓటరు కార్డు కేవలం ఎన్నికల సమయంలోనే అక్కరకొస్తుందని అనేకులు అనుకుంటారు. పోలింగ్ రోజున వెళ్లినప్పుడు మాత్రమే ఓటు గల్లంతయిందని తెలుస్తుంది. ఇదంతా మన పాలకుల నిర్వాకం. అవిద్య రాజ్యమేలేచోట ఏ ప్రచారమూ జనానికి పూర్తిగా చేరదు. 'నిజాయితీగల' ఓటర్లమేనని నిరూపించుకునే భారం ప్రజలకు వదిలితే ఎక్కడైనా జరిగేది ఇదే! చిన్న చిన్న లోపాలు మినహా అంతా సవ్యంగా చేశామని ఈసీ స్పోత్కర్షలకు పోతోంది. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్నది వేరు. ఇందుకు ఒక ఆంగ్ల దినపత్రికలో జార్ఖండ్ గురించి వచ్చిన కథనమే తార్కాణం. అక్కడ గొడ్డా జిల్లాలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా జాబితా ప్రకటించాక ఫలానా వారి పేర్లు తొలగించాలంటూ బీజేపీ ఏజెంట్లు ఫామ్--7 పత్రాలు సమర్పించినట్టు ఆ పత్రిక వెల్లడించింది. ఒక కేంద్రంలో ఇలాంటివి 25 దాఖలయ్యాయి. వారిలో ఒకే ఒక్కరు మూణ్నెల్లక్రితం మరోచోట కూలీ పని కోసం వెళ్లారు. మరోచోట ఒక బీజేపీ ఎమ్మెల్యే 75 ఫామ్‌లు సమర్పించారు. చిత్రమేమంటే... అవన్నీ మైనారిటీల ఓట్లు. వాటిలో అత్యధికం 2003 జాబితాతో మ్యాపింగ్ అయ్యాయి. ఇక వేరే జిల్లాల్లో ఏం జరిగిందో... అసలు 'కొత్తగా చేరుతున్న' వారెవరో తెలియదు. ఓటు లేకపోవటం మరణంతో సమానమని అనేకులు నమ్ముతారు. బీఎల్ఓ వెళ్లినప్పుడు ఇంట్లో లేనంత మాత్రాన ఓటరే ఉనికిలో లేడన్న నిర్ణయానికి రావటం క్రూరం. ఎందుకంటే ఈసారి ఓటు పోవటమంటే సంక్షేమ పథకాలు ఆగిపోవటం,ముందూ మునుపూ పౌరసత్వం కూడా మాయం కావటం. కొన్ని ప్రభుత్వాలు సంక్షేమా నికి ఓటర్ల జాబితా గీటురాయి కాబోదని హామీ ఇస్తున్నాయి గానీ... అది దయాధర్మ బిక్షంగా మారటం సాధారణ పౌరుణ్ణి అవమానించటం. రేపన్న రోజున అలాంటి వారందరికీ పథకాలు ఆపేయాల్సిందేనంటూ ఆదేశాలు జారీ కాబోవని చెప్పలేం. ఆ మాటెలా వున్నా ఓటరును పోలింగ్ కేంద్రం వైపు రాకుండా ఇంత చక్కని మార్గం 'కనిపెట్టిన' ఈసీని అభినందించి తీరాలి!

వాతావరణ మార్పుతో జీవన విధ్వంసం

వాతావరణ మార్పులు, ప్రతికూల ప్రభావాలు ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రాణాంతకంగా కరిగిపోతున్న హిమాలయ హిమానీనదాల నుంచి కేరళలోని పశ్చిమ కనుమల్లో కొండచరియలు విరిగిపడుతున్న ఘటనల వరకు చూస్తూనే ఉన్నాం. మరోవైపు ప్రజలు వినియోగిస్తున్న వివిధ పరికరాల ద్వారా వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగిపోతున్నాయి. దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కూడా సామాన్య కుటుంబాలతో పోల్చితే, సంపన్న కుటుంబాలే కర్బన ఉద్గారాలను ఏడు రెట్లు ఎక్కువ విడుదల చేస్తున్నాయని అధ్యయనాలు చెప్తున్నాయి. ఫలితంగా సమాజంలోని అందరి జీవితాలను దెబ్బతీస్తున్నాయి. అధికంగా కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్న సంపన్న కుటుంబాలు తమ జీవనశైలిని మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు తలెత్తుతున్నది.పర్యావరణ ఉత్పత్తులు వాడండి భూమి నుంచి బయటకు వెళ్లాల్సిన వేడికి ఆటంకం ఏర్పడటం ద్వారా భూమి ఉపరితల సగటు ఉష్ణోగ్రత పెరుగడాన్ని భూతాపం (గ్లోబల్ వార్మింగ్) అంటారు. బొగ్గు మండించడం ద్వారా ఉత్పత్తయ్యే కర్బన ఉద్గారాలు, అడవుల నరికివేతతో ఏర్పడే గ్రీన్‌హౌస్ వాయువులు భూమి నుంచి బయటకు వెళ్లాల్సిన వేడికి ఆటంకం కలిగిస్తుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పుపై ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ (ఐపీసీసీ) శాస్త్రవేత్తలు, నిపుణుల అధ్యయనంలో కీలక విషయాలను గుర్తించారు. వందేండ్లలో భూమి ఉపరితల సగటు ఉష్ణోగ్రత 1.1 సెల్సియస్ పెరిగిందని నిర్ధారించారు. ఇందులో 1.07 సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదలకు మనుషుల కార్యకలాపాలే కారణమని అంచనావేశారు.వాతావరణ నివేదికలు చూడండి ముఖ్యంగా 1970 తర్వాత ఉష్ణోగ్రతల పెరుగుదల రేటు మరింత వేగవంతమైందని గుర్తించారు. వాతావరణ మార్పుతో సముద్ర మట్టంతోపాటు సముద్ర ఉపరితల, పెద్ద సరస్సుల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భారీ వర్షపాతం కారణంగా వరదలు సంభవిస్తున్నాయి. కరువు పరిస్థితులు తీవ్రమై పంటలు ఎండిపోతున్నాయి. పర్యావరణ వ్యవస్థల్లో ప్రతికూల మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల హిమాలయాల్లో హిమానీనదాల క్షీణత తీవ్రం కావడమే ఇందుకు నిదర్శనం. భూతాపంతో పెనుతుఫాన్‌లు అంతకంతకూ ఎక్కువగా, అధిక తీవ్రతతో సంభవిస్తుంటాయి. వేడి గాలులు తరచుగా, ఎక్కువ తీవ్రతతో వీచడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యం మీద ప్రభావం చూపుతున్నాయి. వాతావరణ మార్పుల వల్ల సున్నితమైన హిమాలయ పర్యావరణ వ్యవస్థ వేగంగా అస్థిరమవుతున్నది. హిమానీనదాల క్షీణతతో కోట్లాది మంది జీవనోపాధికి, నీటి భద్రతకు ముప్పు సంభవించే ప్రమాదం పొంచి ఉన్నది. హిమాలయాల్లో ఉద్భవించే ప్రధానమైన సింధు, గంగా, బ్రహ్మపుత్ర నదుల ప్రవాహంలో తీవ్ర హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి.

నదీ ప్రవాహాల్లోని అస్థిరతల వల్ల వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. పర్వతాలు, మైదాన ప్రాంతాల్లో నివసించే ప్రజలు నిరాశ్రయులయ్యే ప్రమాదంలోకి నెడుతున్నది. ఈ నేపథ్యంలోనే నదులను అనుసంధానం చేసే కార్యక్రమాలను కూడా చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉన్నది.

గ్లోబల్ క్లైమేట్ రిస్క్ ఇండెక్స్-2021 ప్రకారం వాతావరణ మార్పుల వల్ల అత్యధికంగా ప్రభావితమవుతున్న ప్రపంచంలోని టాప్ 10 దేశాల్లో భారత్ కూడా ఒకటి. మరోవైపు లండన్‌కు చెందిన అంతర్జాతీయ థింక్ ట్యాంక్ ఓవర్సీస్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ 2021 జూన్‌లో 'ది కాస్ట్స్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ ఇన్ ఇండియా' పేరుతో విడుదల చేసిన నివేదిక కూడా సంచలన అంశాలను బయటపెట్టింది. వాతావరణ మార్పుల కారణంగా 2100 నాటికి భారత్ ఏటా జీడీపీలో 3 నుంచి 10 శాతం వరకు కోల్పోయే ప్రమాదం ఉన్నదని స్పష్టంచేసింది. 2040 నాటికి పేదరిక రేటు 3.5 శాతం పెరుగవచ్చని పేర్కొన్నది. వాతావరణ మార్పుల కారణంగా సంభవించే ప్రమాదాలతో ఖర్చులు, సమాజంలో అసమానతలు, పేదరికం కూడా పెరుగుతాయని ఈ నివేదిక వివరించింది. జీవనశైలిలో వస్తున్న మార్పుల కారణంగా భారత్‌లో ఏటా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు నిరంతరం పెరుగుతున్నాయి. సమస్యను భిన్న కోణాల్లో పరిశీలించడానికి కార్బన్ ఫుట్‌ప్రింట్ విధానం ఒక మార్గంగా పనికొస్తుంది. కార్బన్ ఫుట్‌ప్రింట్ అంటే ఒక వ్యక్తి, సమాజం, కార్యక్రమం, సంస్థ, సేవ లేదా ఉత్పత్తి కారణంగా వెలువడే మొత్తం గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు. ఇందులో కార్బన్ డయాక్సైడ్, మీథేన్ కూడా ఉన్నాయి. ఇక కార్బన్ డయాక్సైడ్‌ను అత్యధికంగా విడుదల చేసే పది దేశాలు ఇవి. చైనా (9.3 జిగా టన్నులు-జీటీ), అమెరికా (4.8), భారత్ (2.2), రష్యా (1.5), జపాన్ (1.1), జర్మనీ (0.7), దక్షిణ కొరియా (0.6), ఇరాన్ (0.6), కెనడా (0.5). అయితే, తలసరి ఉద్గారాలను పరిశీలిస్తే భారత్ ప్రపంచ సగటు కంటే చాలా దిగువన ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా వెలువడే మొత్తం ఉద్గారాల్లో భారత్ వాటా 7.1 శాతం కాగా, భారత్‌లో తలసరి ఉద్గారాలు సుమారు 2.47 టన్నులుగా ఉన్నది. ఇది ప్రపంచ తలసరి సగటు 6.45తో పోలిస్తే చాలా తక్కువ. ఇక్కడ కూడా అభివృద్ధి చెందిన దేశాలకు, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉన్నది. రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమానిటీ అండ్ నేచర్ ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, భారత్‌లో అధికంగా ఖర్చు చేసే సంపన్న కుటుంబాలు, దిగువ స్థాయి కుటుంబాల కంటే దాదాపు ఏడు రెట్లు ఎక్కువగా కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తున్నాయి. దేశంలోని వివిధ సామాజిక-ఆర్థిక వర్గాల్లో అత్యధిక ఉద్గారాలకు కారణమవుతున్న వ్యయాల్లో ఆహారం, విద్యుత్తు రెండు ప్రధాన రంగాలని అధ్యయనం గుర్తించింది. వాతావరణ మార్పులకు తక్కువ కారణం అయినప్పటికీ సామాన్యులు ఎక్కువగా నష్టపోతున్నారు. అందువల్ల, ప్రస్తుత ప్రపంచంలో భూతాపాన్ని ఎదుర్కొనేందుకు సుస్థిరమైన పరిష్కారాలు అత్యంత కీలకం. వాతావరణ మార్పులతో ప్రతికూల పరిస్థితులు ఏర్పడకుండా రెండు విధానాలను అనుసరించాల్సిన అవసరమున్నది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను, వాతావరణ మార్పుల పరిణామాల వల్ల ఎదురయ్యే ప్రమాదాలను తగ్గించడం ద్వారా సమస్యను అధిగమించవచ్చు. సమస్య పరిష్కారానికి తగిన విధానాలను ప్రజలు నిత్య జీవితంలో ఆచరణలో పెట్టినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. అలాగే సమాజంలో అధునిక సాంకేతికత, సేవ లు, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి ఒకవైపు ఉండగా, మరోవైపు పేదరికం, పోషకాహార లోపం, ఆరోగ్య సమస్యలు, సామాజిక వెలివేత, వనరుల క్షీణత సమస్యలు పీడిస్తున్నాయి. ఇది సమాజంలోని తీవ్రమై న వైరుధ్యానికి నిదర్శనం. కాబట్టి పరిష్కార మా ర్గాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, భాగస్వాములను చేసే విషయంలో ప్రభుత్వాలు, పార్టీలు ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి.

పీఎం రేసులోకి కొత్త పేర్లు

భారత జాతీయ రాజకీయం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఊహించడం కష్టం. 2029 సార్వత్రిక ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ, ప్రధానమంత్రి రేసు చుట్టూ ఇప్పుడే ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రధాని ముఖచిత్రం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, కాంగ్రెస్‌కు ఏకపక్షంగా సొంత బలం దక్కక, ప్రాంతీయ మిత్రపక్షాల మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి వస్తే మాత్రం ప్రధానమంత్రి అభ్యర్థిత్వం అతిపెద్ద చిక్కుముడిగా మారుతుంది. గత చరిత్రను గమనిస్తే, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి బలమైన ప్రాంతీయ పార్టీలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఏకగ్రీవంగా అంగీకరించడంలో ఎప్పుడూ సంకోచిస్తూనే ఉన్నాయి.ఇలాంటి పరిస్థితుల్లోనే మిత్రపక్షాలకు అందరికీ ఆమోదయోగ్యమైన ఒక సర్వసమ్మత నాయకుడి అన్వేషణ ప్రారంభమవుతుంది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1996లో హెచ్.డి. దేవేగౌడ, ఐ.కె. గుజ్రాల్ వంటి నాయకులు అనూహ్యంగా ప్రధాని పీఠాన్ని అధిరోహించిన సందర్భాలు ఉన్నాయి. సరిగ్గా ఈ సమీకరణాల్లోనే, తమిళనాడు ముఖ్యమంత్రి , తమిళగ వెట్రి కజగం అధినేత జోసెఫ్ విజయ్ పేరు జాతీయ స్థాయిలో చర్చకు వస్తోంది. సంకీర్ణ రాజకీయాల్లో విపక్ష ప్రాంతీయ పార్టీలు తమ కంటే బలమైన జాతీయ నేతను ప్రధానిగా అంగీకరించడానికి ఇష్టపడవు. అక్కడ వివాదరహితుడు, అందరికీ సర్దుబాటు అయ్యే కొత్త ముఖానికే ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ఇటీవల వెలువడిన సర్వేలో ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తదుపరి స్థానంలో అనూహ్యంగా విజయ్ మూడో స్థానంలో నిలిచారు. ఇది టీవీకే శ్రేణుల్లోనే కాకుండా జాతీయంగా చర్చనీయాంశమైంది. తమిళనాడులోని టీవీకే మంత్రులు, సీనియర్ నేతలు విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, ఉత్తరాది ప్రజలు కూడా ఆయన వైపే చూస్తున్నారని వ్యాఖ్యానించడం కాంగ్రెస్-టీవీకే కూటమిలో విబేధాలకు దారితీసింది. విజయ్‌కి ఏ జాతీయ పార్టీతోనూ దీర్ఘకాల శత్రుత్వం లేదు. దక్షిణాదికి చెందిన ప్రజాదరణ పొందిన నాయకుడు కావడం, సిద్ధాంతపరమైన తీవ్రమైన మరకలు లేకపోవడం వల్ల ప్రాంతీయ పార్టీల అధినేతలకు రాహుల్ కంటే విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా మద్దతు ఇవ్వడం సులువుగా మారవచ్చు.విజయ్‌ని ప్రధాని అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేయడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందిస్తోంది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ దీనిని టీవీకే నేతల ఫ్యాన్ క్లబ్ మానసిక స్థితి గా అభివర్ణించడమే కాక, 2029లో రాహుల్‌ను ప్రధానిగా అంగీకరించకపోతే తమిళనాడు కేబినెట్ నుంచి కాంగ్రెస్ మంత్రులు తప్పుకుంటారని హెచ్చరించే స్థాయికి విభేదాలు వెళ్లాయి.

కీలక ప్రతిపాదనలకు రక్షణ శాఖ పచ్చజెండా

దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.

రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర

సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది.

డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు



కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు

భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.

98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరణ

భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం

భారత అంతరిక్ష రంగాన్ని విస్తరించేందుకు మన దేశీయ పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థల భాగస్వామ్యం మరింత పెరగాలని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పిలుపునిచ్చారు. ఉపగ్రహాలకు, ప్రయోగాలకు పెరుగుతున్న డిమాండ్‌ను కేవలం ఇస్రో ఒక్కటే తీర్చలేదు అని ఆయన నొక్కి చెప్పారు. నేడు ప్రైవేటు రంగ భాగస్వామ్యం, సాంకేతిక పురోగతి, ప్రతిష్ఠాత్మక మిషన్లు, అంతర్జాతీయ సహకారంతో కూడిన కొత్త దశలోకి భారత అంతరిక్ష కార్యక్రమం అడుగుపెడుతోందని వి.నారాయణన్ పేర్కొన్నారు. బెంగళూరు స్పేస్ ఎక్స్‌పో 2026 (9వ ఎడిషన్)లో ప్రసంగిస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

"ప్రస్తుతం అంతరిక్షంలో మనకు సంబంధించిన అసెట్స్? (ఉపగ్రహాలు) 56 మాత్రమే ఉన్నాయి. కానీ మన అవసరాలు తీర్చేందుకు ఇంకా చాలా ఉపగ్రహాలు కావాల్సి ఉంది. రానున్న 6-7 ఏళ్లలో కనీసం 200 నుంచి 300 ఉపగ్రహాలను తయారు చేసి ప్రయోగించాల్సి ఉంది. ఈ పనిని కేవలం ఇస్రో మాత్రమే చేయలేదు."

ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సంస్కరణలను తీసుకువచ్చిందని ఇస్రో ఛైర్మన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రైవేటు అంతరిక్ష కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడానికి ఇన్?-స్పేస్? (×చీ-ఖూఖూజవ) సంస్థ పనిచేస్తోందన్నారు. అలాగే వాణిజ్య పురోగతికి మద్దతు ఇవ్వడంలో 'న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్? ' (ఎన్?ఎస్?ఐఎల్?) కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. భారత అంతరిక్ష రంగానికి దేశీయ పరిశ్రమలు అందిస్తున్న సహకారాన్ని నారాయణన్? కొనియాడారు. ఒక రాకెట్ ప్రయోగానికి అయ్యే బడ్జెట్లో దాదాపు 80 శాతం నిధులు భారతీయ పరిశ్రమలకే వెళ్తాయని ఆయన గుర్తు చేశారు. "పీఎస్?ఎల్?వీ, జీఎస్?ఎల్?వీ, ఎల్?వీఎం3 లాంటివాటి



తయారీకి అయ్యే బడ్జెట్లో 80 శాతం భారతీయ పరిశ్రమలకే వెళ్తుందని మీరు అర్థం చేసుకోవాలి. భారత అంతరిక్ష కార్యక్రమం సాధిస్తున్న విజయం వెనుక మన దేశీయ పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యం ఉందని మీరు గుర్తించాలి" అని ఆయన అన్నారు.

ఎక్కువ ప్రయోగాలు చేయాల్సిందే!

ప్రస్తుతం మన దేశంలో అంతరిక్ష రంగానికి సంబంధించి దాదాపు 450 స్టార్టప్? కంపెనీలు పనిచేస్తున్నాయని వి.నారాయణన్? పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయ స్టార్టప్ వ్యవస్థ ఎంతో బలంగా ఎదుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే భారతదేశం తన అంతరిక్ష లక్ష్యాలను చేరుకోవాలంటే, రాకెట్ ప్రయోగాల సంఖ్యను గణనీయంగా పెంచాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 'నేను 1984లో ఇస్రోలో చేరినప్పుడు, మూడేళ్లకు ఒకసారి లేదా రెండేళ్లకు ఒకసారి రాకెట్ ప్రయోగించేవాళ్లం. కానీ ఇప్పుడు నెలకొక ప్రయోగం చేస్తున్నాం. అయితే ఇది సరిపోదు. మనం ఏడాదికి దాదాపు 50 ప్రయోగాలు చేయాల్సిన అవసరం ఉంది. కాబట్టి మనమంతా కలిసికట్టుగా పనిచేయాలి' అని ఆయన పిలుపునిచ్చారు.

ప్రైవేటు రంగం భేష్?!

ఇన్-స్పేస్? ఛైర్మన్? పవన్? గోయెంకా భారత్?లో ప్రైవేటు సంస్థలు అంతరిక్ష రంగంలో సాధిస్తున్న వేగవంతమైన పురోగతిని వివరించారు. 2014లో కేవలం ఒకే ఒక స్పేస్ స్టార్టప్? ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 450 దాటిందని ఆయన అన్నారు. ఈ ఒక్క సంవత్సరంలోనే ప్రైవేటు రంగం నుంచి 160 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ఆయన తెలిపారు. ఇస్రో, ప్రైవేటు పరిశ్రమలు, ఇన్?-స్పేస్? మధ్య పెరుగుతున్న భాగస్వామ్యానికి 'స్కైరూట్? ఏరోస్పేస్?' ఒక మంచి ఉదాహరణ అని గోయెంకా పేర్కొన్నారు. ఈ సంస్థ భారతదేశపు మొదటి ప్రైవేటును రాకెట్?ను అభివృద్ధి చేసి, కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపే సామర్థ్యాన్ని సాధించిందని ఆయన గుర్తు చేశారు.

"ఈ భాగస్వామ్యమే భారతదేశానికి ఉన్న అసలైన బలం. 6 దశాబ్దాల ఇస్రో అనుభవం, నేడు ప్రైవేట్ రంగంతో చేతులు కలిపింది. ఇస్రో, ప్రైవేట్ సంస్థలు కలిసికట్టుగా ఎదుగుతున్నాయి. ఇస్రో, ఇన్?-స్పేస్?, ఎన్?ఎస్?ఐఎల్?, ప్రైవేటు కంపెనీలు, ఎంఎస్?ఎంఈలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారులతో కూడిన ఒక పూర్తి స్థాయి అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను భారత్? నిర్మిస్తోంది" అని పవన్? గోయెంకా తెలిపారు. భారత కంపెనీలు తమ సేవల విలువను మరింత పెంచుకుంటూ, ప్రపంచ అవసరాలను తీర్చాలని కోరారు. అలాగే అంతర్జాతీయ కంపెనీలు భారతదేశాన్ని ఒక తయారీ, సాంకేతిక అభివృద్ధి, అంతరిక్ష భాగస్వామ్యాలకు ఒక ప్రధాన కేంద్రంగా చూడాలని ఆయన కోరారు.

ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది

నిత్యావసరాల ధరల పెరుగుదల వేళ కేంద్రంలోని మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ద్రవ్యోల్బణం 'హై-వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని విమర్శించింది. ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉందని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్? వ్యాఖ్యానించారు. పండుగ షాపింగ్ సీజన్ ప్రారంభం కాకముందే పెరుగుతున్న ధరలు గృహ బడ్జెట్లపై భారం మోపాయని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు.

"ద్రవ్యోల్బణం 'హై వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోంది. కేవలం మూడు వారాల్లోనే ఉల్లిపాయల ధరలు రెట్టింపు అయ్యాయి. చక్కెర ధర 25 శాతం పెరిగింది. కందిపప్పు, మినుములు, ఆవాలు, రిఫైన్?డ్ ఆయిల్ ధరలు కూడా పెరిగాయి. దీపావళికి ముందే బాదం, జీడిపప్పు, పిస్తా, ఎండుద్రాక్ష, వాల్‌నట్‌లు కూడా ఖరీదయ్యాయి. పాలు, చక్కెర ధరలు పెరగడంతో స్వీట్ల ధరలు కూడా నిరంతరం పెరుగుతున్నాయి. నెయ్యి, మసాలాల ధరలు కూడా పెరుగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వంటగది, పండుగలు ఖరీదైనవిగా మారాయి. గృహ బడ్జెట్ ఇబ్బందుల్లో పడింది. ప్రజల జేబులపై పడుతున్న ఈ భారం మోదీ ప్రభుత్వానికి కనిపించడం లేదు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయకుండా, ప్రభుత్వం గణాంకాల గారడీతో దాని ప్రభావాన్ని దాచడంలో నిమగ్నమైంది. మోదీ గణాంకాల గారడీ ద్రవ్యోల్బణం ప్రభావాన్ని దాచలేరు. ప్రజలు ప్రతీదీ గమనిస్తున్నారు."

పెరుగుతున్న ధరల రూపంలో దేశానికి "హై వోల్టేజ్ షాక్" ఇస్తోందని కేంద్రంపై కాంగ్రెస్ ఇప్పటికే తీవ్ర విమర్శలు గుప్పించింది. అలాగే "అహంకారపూరిత" మోదీ ప్రభుత్వం "గణాంకాల గారడీ"తో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తోందని పేర్కొంది. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో నమోదైన 7.8 శాతం జీడీపీ (+ణూ) వృద్ధి రేటు "ఆర్థిక



పునరుజ్జీవనానికి సంకేతం" కాదని ఆ పార్టీ తెలిపింది.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా జాప్యంపై కాంగ్రెస్ ఫైర్

మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా వేయడంలో జాప్యంపై కాంగ్రెస్ సోమవారం ప్రశ్నించింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదించడానికే హోం మంత్రి అమిత్ షా సభలను వాయిదా వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్? ఈ మేరకు ఎక్స్? వేదికగా పోస్ట్ చేశారు. "పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేసి నేటికి సరిగ్గా 25 రోజులు అయ్యింది. కానీ దానిని ఇంకా ప్రొరోగ్ చేయలేదు. సాధారణంగా నిరవధిక వాయిదా వేసిన 3-4 రోజుల తర్వాత ప్రొరోగేషన్ జరుగుతుంది. కానీ 2015 వర్షాకాల సమావేశాల్లో ఇది 28 రోజుల వ్యవధి ఉంది. లలిత్ మోదీ అంశంపై ఆందోళనలతో ఆ సమావేశాలు దాదాపు పూర్తిగా రద్దయ్యాయి. కానీ మోదీ ప్రభుత్వం జీఎస్టీ బిల్లులను బలవంతంగా ఆమోదింపజేయాలనే ఆశతో సమావేశాలను కొనసాగించింది. దానికి రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం, కానీ అది వారికి లేదు. చివరికి, మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలతో మరింత అర్థవంతంగా సంప్రదించి చాలా ఆలస్యంగా బిల్లులను ఆమోదించాల్సి వచ్చింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదం కోసం హోం మంత్రి ఇప్పటికీ లోక్‌సభలో తనకు ఇష్టమైన మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం నానా తంటాలు పడుతుండటంతో 2026 వర్షాకాల సమావేశాలు వెంటిలేటర్‌పై ఉన్నాయి. ఆయన బెదిరింపులు, భయపెట్టే రాజకీయాలు హద్దులు దాటాయన్న వాస్తవాన్ని అంగీకరించడానికి ఇంకెంత కాలం పడుతుంది?" అని జైరాం రమేశ్? అన్నారు.

మోదీ సభ కోసం తొలిసారి 'బుక్ మైషో'లో రిజిస్ట్రేషన్



భారత ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 8న గుజరాత్‌లోని వడోదరలో పాల్గొననున్న కార్యక్రమానికి ప్రజల నుంచి ముందుగానే విశేష స్పందన వచ్చింది. తొలిసారిగా ప్రధాని కార్యక్రమానికి 'బుక్ మైషో' ద్వారా ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపట్టారు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రారంభమైన గంటలోపే అందుబాటులో ఉన్న సీట్లన్నీ బుక్ అయిపోయాయి. ఆ తర్వాత కూడా భారీ సంఖ్యలో ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నించడంతో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. ఈ సీట్ల బుకింగ్ తీరు మోదీ కార్యక్రమం పట్ల ప్రజలకు ఉన్న అపారమైన ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోంది. నరేంద్ర మోదీ మంగళవారం వడోదరలో పర్యటించనున్నారు. నగరంలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇంకొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ ప్రోగ్రామ్ సీట్ల రిజిస్ట్రేషన్ కోసం తొలిసారి వడోదర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) బుక్ మైషోను ఉపయోగించింది. దీంతో ప్రధాని సభకు భారీగా స్పందన రావడం గమనార్హం.

'నవంబర్ 30 కల్లా నివేదిక సమర్పించాల్సిందే'

ఆరావళిపై కమిటీకి సుప్రీంకోర్టు డెడ్‌లైన్
ఆరు నెలల గడువు కోరిన హైపవర్ కమిటీ
నవంబర్ 30లోగా తుది నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశం
ఆలస్యం చేస్తే కమిటీని పూర్తిగా పునర్వ్యవస్థీకరిస్తామని హెచ్చరిక



ఆరావళి పర్వత శ్రేణి పరిధి, నిర్వచనం, పరిరక్షణకు సంబంధించిన తుది నివేదికపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. నివేదిక సమర్పించేందుకు మరో ఆరు నెలల గడువు కావాలని హైపవర్ కమిటీ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. నవంబర్ 30లోగా తుది నివేదికను సమర్పించాలని డెడ్‌లైన్ విధించింది. గడువులోగా నివేదిక ఇవ్వడంలో విఫలమైతే మొత్తం కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, దాని పరిధి, పర్యావరణ పరిరక్షణ, ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు కొన్ని నెలల క్రితం కమిటీని ఏర్పాటు చేసింది. ఆరావళి ప్రాంతాన్ని ఏ విధంగా గుర్తించాలి? ఏ ప్రాంతాలను రక్షణ పరిధిలోకి తీసుకురావాలి? మైనింగ్‌పై ఎలాంటి నియంత్రణలు ఉండాలి? అనే అంశాలపై కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోంది. తుది నివేదిక సమర్పించేందుకు కమిటీకి గతంలో ఇచ్చిన గడువు ఆగస్టు 31తో ముగిసింది. అయితే ఆ అంశంపై సమగ్రంగా, భవిష్యత్తులో కూడా సమర్థించగలిగే విధంగా నివేదిక సిద్ధం చేయాలంటే మరింత సమయం అవసరమని కమిటీ పేర్కొంది. అందులో భాగంగా మరో ఆరు నెలల గడువు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది. అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అయితే ఆ అభ్యర్థనపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆ వ్యవహారాన్ని విచారించింది. కమిటీ కోరిన ఆరు నెలల గడువును ఇవ్వడానికి నిరాకరించింది. ఆరావళి అంశాన్ని మరింత కాలం వాయిదా వేయడం సరికాదని స్పష్టం చేసింది.

'రాత్రింబవళ్లు పనిచేయండి'

కమిటీ అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి నివేదిక సిద్ధం చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించాలని ఆదేశించారు. రెండు నెలల సమయంలో నివేదిక ఇవ్వలేకపోతే ప్రస్తుత కమిటీని పూర్తిగా రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఆరావళి అంశం ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహారాన్ని ఇకపై పెండింగ్‌లో ఉంచలేమన్న సంకేతాన్ని కోర్టు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఒక మధ్యంతర నివేదిక సిద్ధమైందని కోర్టుకు తెలిపారు. అయితే దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి, మధ్యంతర నివేదిక కాకుండా తుది నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. ఆరావళి ప్రాంతంలోని అన్ని వర్గాల అభిప్రాయాలను పూర్తిస్థాయిలో తెలుసుకోవాల్సి ఉందని వివరించారు. ముఖ్యంగా ప్రభావిత వర్గాలకు తగినంత సమయం ఇచ్చి వారి అభిప్రాయాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని, మరింత సమయం అవసరమవుతుందని కోర్టుకు చెప్పారు.

'గిరిజనుల అభిప్రాయాలు తీసుకోవాలి'

అయితే రాజస్థాన్, గుజరాత్‌లలోని గిరిజన సమాజాలతో పాటు ఆరావళి ప్రాంతానికి సంబంధించిన అన్ని వర్గాల అభిప్రాయాలను కమిటీ తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. అవసరమైతే అత్యవసర అంశాలపై విడివిడిగా మధ్యంతర నివేదికలను కూడా సమర్పించవచ్చని తెలిపింది. తద్వారా అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలపై కోర్టు విడిగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, మైనింగ్ నియంత్రణపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. 2025 నవంబర్ 20న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆరావళి కొండలు, పర్వత శ్రేణికి ఎత్తు ఆధారిత నిర్వచనాన్ని ఆమోదించింది. స్థానిక భూభాగం నుంచి 100 మీటర్ల ఎత్తు ఉన్న భౌగోళిక ఆకృతులను ఆరావళి కొండలుగా పరిగణించాలని నిర్ణయించింది. అలాగే 500 మీటర్ల పరిధిలో ఉన్న రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండలను ఆరావళి శ్రేణిగా పరిగణించేలా నిర్వచనం ఇచ్చింది. ఆ నిర్వచనంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొత్త ప్రమాణాల వల్ల ఆరావళి ప్రాంతంలో పెద్ద భాగం రక్షణ పరిధి నుంచి బయటపడే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు, ఇతర వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో మైనింగ్ కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గత డిసెంబర్‌లో ఆ తీర్పును రద్దు చేసింది. పాత కమిటీ సిఫార్సులను అమలులో లేకుండా చేసింది. ఆరావళి పర్యావరణ వ్యవస్థపై సమగ్రంగా అధ్యయనం చేసి, శాస్త్రీయ ఆధారాలతో కొత్త నిర్వచనాన్ని సూచించేందుకు కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత డిసెంబర్ 2న ఆ కేసును సుప్రీంకోర్టు మరోసారి విచారించనుంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా పీజీఆర్ఎస్

సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం

నాణ్యమైన సేవలు అందించడం అధికారుల బాధ్యత

జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 171 అర్జీలు

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు అర్జీల పరిష్కార నాణ్యతలో రాజీలేకుండా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహంతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 171 అర్జీలు అందాయి. వీటిలో రెవెన్యూ సేవలకు సంబంధించి 50, పోలీసు శాఖకు 33, పురపాలక, పట్టణాభివృద్ధికి 24, పంచాయతీరాజ్‌కు 15 అర్జీలు వచ్చాయి. విద్య, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖలకు ఏడు చొప్పున, వైద్య ఆరోగ్య శాఖకు 6, విద్యుత్ శాఖకు 4 అర్జీలు అందాయి. ఎండోమెంట్స్, ఇరిగేషన్, స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు శాఖలకు మూడు చొప్పున, డీఆర్‌డీఏ, ఉపాధి కల్పన, సమగ్ర శిక్ష విభాగాలకు రెండేసి చొప్పున అర్జీలు వచ్చాయి. పశుసంవర్ధక, ఐసీడీఎస్, సమాచార, మార్కెటింగ్, గ్రామీణ నీటి సరఫరా, రవాణా, సాంకేతిక విద్యా శాఖలకు ఒక్కో అర్జీ అందింది. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పీజీఆర్ఎస్ ద్వారా నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కలుగుతోందన్నారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని బాధ్యతగా స్వీకరించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించాలని, పరిష్కారంలో వేగంతో పాటు నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

యువత సృజనాత్మకతకు వేదికగా కంటెంట్ క్రియేషన్ స్టూడియో

కంటెంట్ క్రియేషన్ స్టూడియో, ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

'లోకల్ టాలెంట్ -- లోకల్ ఇన్‌కమ్'కు ప్రోత్సాహం

పర్యాటక, సాంస్కృతిక వైభవానికి డిజిటల్ ప్రచారం





విజయవాడ, మహానగర్

జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంటెంట్ క్రియేషన్ స్టూడియో, ల్యాబ్‌లను యువత, మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. 'ఆరెంజ్ ఎకానమీ'లో భాగంగా సృజనాత్మకత, డిజిటల్ మీడియా, పర్యాటకం, సంస్కృతి, ఉపాధిని అనుసంధానం చేస్తూ యువతకు కొత్త అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. కంటెంట్ ల్యాబ్‌లో వీడియో రికార్డింగ్, ఎడిటింగ్, లైవ్ స్ట్రీమింగ్ వంటి ప్రొఫెషనల్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కంటెంట్ తయారీ, వీడియో చిత్రీకరణ, ఎడిటింగ్, కథనం, బాధ్యతాయుతమైన సోషల్ మీడియా వినియోగంపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, గ్రామీణ యువతలోని ప్రతిభను గుర్తించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలుగా మలచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్‌టీఆర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, పండుగలు, స్థానిక వంటకాలు, జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలను డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసేలా నాణ్యమైన కంటెంట్ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. తద్వారా 'లోకల్ టాలెంట్ -- లోకల్ ఇన్‌కమ్'కు ప్రోత్సాహం లభించడంతో పాటు జిల్లాకు విస్తృత పర్యాటక, సాంస్కృతిక ప్రచారం లభిస్తుందని తెలిపారు. కంటెంట్ స్టూడియో, ల్యాబ్ వినియోగం, శిక్షణకు సంబంధించిన వివరాల కోసం కంటెంట్ ల్యాబ్ నిర్వాహకులు బీవీ రామకృష్ణను 9885202025 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

పరిశుభ్రత కోసం ఉమ్మడి నిబద్ధతే 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్'

పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చడమే లక్ష్యం

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



విజయవాడ, మహానగర్

స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ కేవలం పోటీ కోసం నిర్వహించేవి కావని, పరిశుభ్రత కోసం ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబించే ప్రజా ఉద్యమమని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ప్రసాదంపాడులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో సోమవారం స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026కు సంబంధించి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రతపై స్వచ్ఛ ఆంధ్ర మిషన్ (ఎస్ఏఎం) అంచనాలు రూపొందిస్తోందన్నారు. పరిశుభ్రత, జవాబుదారీతనాన్ని పెంపొందించడం పని సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండటం సుపరిపాలనకు సంకేతమే కాకుండా ప్రజలు, పర్యావరణం పట్ల గౌరవానికి నిదర్శనమన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా అక్టోబర్ 2న స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్--2026 విజేతలను ప్రకటించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవార్డులను అందజేస్తారని చెప్పారు. దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ అవార్డులను ప్రవేశపెట్టామని, ఇతర రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన సంస్థలకు అవార్డులు అందజేస్తామని, సంస్థలు, పరిపాలనా విభాగాల మధ్య ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహిస్తామని తెలిపారు. వ్యర్థాల నిర్వహణ, ఉత్తమ పద్ధతులు, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, హాస్టళ్లు, స్వచ్ఛంద సంస్థల పనితీరును పారదర్శకంగా, సాక్ష్యాధారాలతో, నిష్పక్షపాతంగా అంచనా వేస్తామని తెలిపారు. వ్యర్థాలను మూలం వద్దే వేరు చేయడం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, చేతులు కడుక్కునే సౌకర్యాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం అమలు, పౌరులు, ఉద్యోగుల అభిప్రాయాలు, స్వతంత్ర తృతీయ పక్ష ధ్రువీకరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. స్వచ్ఛ ఆంధ్రను నిజమైన ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి శాఖ, స్థానిక సంస్థ, పౌరుడు చురుకుగా భాగస్వాములు కావాలని పట్టాభిరామ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సీఓఓ దశరథ్ రామిరెడ్డి, జియోస్టాట్ ఎండీ వివేక్ రెడ్డి, అంచనా ప్రక్రియకు నియమించిన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 86 ఫిర్యాదులు



విజయవాడ క్రైమ్, మహానగర్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి సోమవారం మొత్తం 86 ఫిర్యాదులు అందాయి. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ఆదేశాల మేరకు డీసీపీ ఎ.బి.టి.ఎస్. ఉదయారాణి, ఏసీపీ వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని నిర్వహించి బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన కార్యక్రమంలో బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదుల్లో భూ, ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలకు సంబంధించి 39, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు 5, వివిధ మోసాలకు 5, మహిళా సంబంధిత నేరాలకు 6, కొట్లాటలకు 6, దొంగతనాలకు 3, ఇతర సమస్యలకు సంబంధించి 24 ఫిర్యాదులు ఉన్నాయి. బాధితులు అందించిన ఫిర్యాదులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదుల పరిష్కారానికి సహకరించారు.

భాగ్యనగరంలో 'బోధి భోజనాలయం' ప్రారంభం



హైదరాబాద్, మహానగర్

ఆహారం కేవలం ఆకలి తీర్చేందుకు మాత్రమే కాకుండా దేహానికి పోషణ, మనస్సుకు ప్రశాంతత, ఆత్మకు ఆనందాన్ని అందించే అనుభూతిగా ఉండాలనే ఉద్దేశంతో 'బోధి భోజనాలయం--స్పిరిచువల్ డైనింగ్'ను హైదరాబాద్ గచ్చిబౌలిలో ప్రారంభించారు. భారతీయ సనాతన సంప్రదాయంలోని ఆహారం, ఆతిథ్యం, సంస్కృతి, ఆధ్యాత్మికతకు ఉన్న అనుబంధాన్ని ఆధునిక డైనింగ్ వాతావరణంలో పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ వేదికను స్పిరిచువల్ డైనింగ్--బోధి భోజనాలయం వ్యవస్థాపకుడు, సీఈఓ ఎం. శ్రీనివాస్ చక్రవర్తి రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో భోజనం పవిత్రతను తీసుకురావడమే 'బోధి' ఉద్దేశమన్నారు. ఆహారాన్ని సంపూర్ణ పోషణగా, పవిత్ర సమర్పణగా భావించే అనుభూతిని ప్రజలకు అందించాలన్నారు. భగవాన్ శ్రీ రమణ మహర్షి బోధనల స్ఫూర్తితో ప్రారంభమైన బోధి భోజనాలయం ఆహారాన్ని దైవంగా భావించడం, వంటను నైవేద్యంగా సమర్పించడం, భోజనాన్ని కృతజ్ఞత, ఏకాగ్రత, సేవ, కరుణలకు ప్రతీకగా మలచుకునే భారతీయ సంప్రదాయాన్ని పునరుజ్జీవింపజేయనుందని తెలిపారు. భారతీయ విలువలను ఆధునిక వృత్తిపరమైన డైనింగ్ వాతావరణంతో మేళవించి ప్రత్యేక అనుభూతిని అందించడమే లక్ష్యమన్నారు. భాగ్యనగరం నుంచి ప్రపంచానికి స్పిరిచువల్ డైనింగ్ ప్రత్యేకతను పరిచయం చేయాలనే సంకల్పంతో దీనిని ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఆతిథ్య బ్రాండ్‌గా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సునీల్ నారంగ్, భరత్ నారంగ్, అనుగు సంతోష్ రెడ్డి, అంజన్ మొహంతి, కర్ణన్, మహేష్ భగవత్, వినయ్, రాజన్, డాక్టర్ దగ్గుబాటి సురేష్ బాబు, ముప్పా వెంకయ్య చౌదరి, ఎం. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు టీటీడీలో ఉద్యోగ అవకాశాలు

విజయవాడ, మహానగర్


కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల్లో నివసిస్తున్న మాజీ సైనికులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం పొందే అవకాశం కల్పిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా సైనిక సంక్షేమ అధికారి వై.ఈశ్వరరావు తెలిపారు. ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్‌మెంట్ ఆర్గనైజేషన్ (సికింద్రాబాద్), ఏపీ సైనిక్ సంక్షేమ శాఖ సహకారంతో కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు, బాపట్ల, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన మాజీ సైనికుల కోసం ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ సెప్టెంబర్ 9న ఉదయం 6 గంటల నుంచి విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఎంపికై విధుల్లో చేరే సమయానికి అభ్యర్థి వయస్సు 50 సంవత్సరాలు మించరాదని పేర్కొన్నారు. అర్హత కలిగిన మాజీ సైనికులు స్పోర్ట్స్ లేదా రన్నింగ్ షూస్‌తో ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్ కార్డు, పాన్ కార్డు, మాజీ సైనికుని ఐడీ కార్డు, డిశ్చార్జ్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్, పదో తరగతి మార్కుల మెమో, 8 ఒరిజినల్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. అన్ని ధ్రువపత్రాలకు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు కూడా వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన మాజీ సైనికులకు నెలకు రూ.24,743 వేతనంతో పాటు ఉచిత సింగిల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన మాజీ సైనికులు ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ జిల్లా సైనిక సంక్షేమ అధికారి వై.ఈశ్వరరావు కోరారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల భద్రతే ప్రథమ ప్రాధాన్యం

సామాన్య భక్తుల సుఖమయ దర్శనమే లక్ష్యం

దసరా ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సమీక్ష

విజయవాడ, మహానగర్:



ఇంద్రకీలాద్రిపై త్వరలో జరగనున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందని ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు తెలిపారు. దసరా ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో టెంపుల్ ఈవో శ్రీనానాయక్, పశ్చిమ డీసీపీ రామకృష్ణ, ఇతర పోలీస్, దేవస్థాన అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల భద్రత, భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, క్యూలైన్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. వీఐపీ ప్రాధాన్యతల కంటే సామాన్య భక్తుల సౌకర్యం, సురక్షిత దర్శనానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రతి భక్తుడు అమ్మవారిని ప్రశాంతంగా దర్శించుకుని సురక్షితంగా తిరిగి వెళ్లేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, క్యూలైన్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సూచించారు. నగర సరిహద్దుల నుంచి ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాల వరకు సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి భక్తులకు ఎప్పటికప్పుడు సరైన సమాచారం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పశ్చిమ ఏసీపీ ఎన్.వి. దుర్గారావు, ఇన్స్పెక్టర్ గుణరామ్, టెంపుల్ ఈఈ రమాదేవి తదితర పోలీస్, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

బిజినెస్

మూడు నెలల్లో మూడోసారి..
మారుతి కార్ల ధరలు పెంపు!



ప్రముఖ వాహన తయారీ సంస్థ మారుతి సుజుకి.. 2026 బాలెనో ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసింది కొన్ని రోజులకే, తమ ఇతర మోడల్స్ ధరలను మరోసారి పెంచనున్నట్లు వెల్లడించింది. ఈ ధరల పెరుగుదల మూడు నెలల్లో మూడోసారి కావడం గమనార్హం. కంపెనీ ప్రకారం.. ముడిసరుకుల ఖర్చులు నిరంతరం పెరుగుతున్న కారణంగా, ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ. 20,000 వరకు పెంచాలని కంపెనీ నిర్ణయించింది. ఈ ధరల పెంపు ఈ నెల నుంచే అమల్లోకి వస్తుంది. మారుతి సుజుకి మాత్రమే కాకుండా.. కార్ల ధరలను పెంచిన కంపెనీల జాబితాలో టాటా మోటార్స్ కూడా ఉంది. 1 సెప్టెంబర్ 2026 నుంచి అమలులోకి వచ్చేలా, తమ పెట్రోల్/డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాల శ్రేణికి గరిష్టంగా రూ.25,000 వరకు పెంపును ప్రకటించింది. హ్యుందాయ్ మోటార్ కూడా జనవరి, జూన్‌లలో చేసిన సవరణల తర్వాత ఈ ఏడాది మూడవసారిగా, సెప్టెంబర్ నుంచి తమ పోర్ట్‌ఫోలియో అంతటా ధరలు 1% వరకు పెరుగుతాయని తెలిపింది. మహీంద్రా & మహీంద్రా ఇప్పటికే జూలై 2026 నుంచి శ్రేణి ధరలను సగటున 2.7% పెంచింది.

బంగారం, వెండిలో పెట్టుబడులకు షగున్ సిప్



డిజిటల్ విధానంలో పసిడి, వెండిని కొనుగోలు చేసేందుకు ఉపయోగపడేలా 'షగున్ సిప్'ను ప్రవేశపెట్టినట్లు యాక్సిస్ ఎంఎఫ్ వెల్లడించింది. యాక్సిస్ గోల్డ్ ఫండ్, యాక్సిస్ సిల్వర్ ఫండ్ ఆఫ్ ఫండ్‌లలో గ్రాముల లెక్కన పెట్టుబడులు పెట్టేందుకు ఈ తరహా డిజిటల్ సిప్ ఫీచరును ప్రవేశ పెట్టడం పరిశ్రమలోనే ఇది తొలిసారని పేర్కొంది. 25 కేజీల దాకా బంగారం, 50 కేజీల వరకు వెండి కొనుగోలు కు అవసరమయ్యే మొత్తాన్ని పోగు చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. డిజిటల్‌గా ఇన్వెస్ట్ చేయడంతో ఫిజి కల్ రూపంలో అదనపు వ్యయాలు, భద్రపర్చు కోవాల్సిన భారం ఉండదని సంస్థ తెలిపింది.

విలన్లకు నో ఐఫోన్.. యాడ్‌లో ఎప్పుడూ 9.41
యాపిల్ విశేషాలు తెలుసా..?

ఇంటర్నెట్ డెస్క్: యాపిల్ క్రేజే వేరు. ఇక ఐఫోన్ల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు కొత్త వెర్షన్ మార్కెట్‌లోకి వస్తోందంటే ఉండే హడావుడి అంతా ఇంతా కాదు. లాంచ్ రోజున క్యూ లైన్లలో నిలబడి మరీ వాటిని కొనేస్తారు. ఈ వారం ఐఫోన్ 18 సిరీస్ రాబోతుంది. ఈ వెర్షన్స్‌పై ఇప్పటికే టెక్‌ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. మరి ఇంత క్రేజ్ ఉన్న యాపిల్ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు చూద్దామా..!

మొదటి లోగో ఏంటంటే..

యాపిల్ అనగానే మనకు గుర్తొచ్చేది సగం కొరికిన యాపిల్ పండే. కానీ, ఈ సంస్థ మొదటి లోగో ఇది కాదు. యాపిల్ చెట్టు కింద కూర్చున్న ఐజాక్ న్యూటన్ బొమ్మను లోగోగా రానాల్డ్ వేన్ డిజైన్ చేశారు. ఆ తర్వాత దాన్ని మార్చారు. ప్రస్తుతం ఉన్న లోగోను రాబ్ జానోఫ్ రూపొందించారు. దూరం నుంచి చూసినా, పరిమాణం తగ్గించినా చెర్రీ పండులా కనిపించకుండా.. స్పష్టంగా యాపిల్ అని గుర్తు పట్టడానికి వీలుగా ఒక వైపు కొరికినట్లు పెట్టారు.

మూడో వ్యక్తి ఉన్నారు..

స్టీవ్ జాబ్స్, స్టీవ్ వోజ్నియాక్‌లతో పాటు రానాల్డ్ వేన్ కలిసి యాపిల్ సంస్థను స్థాపించారు. అయితే, కంపెనీ ప్రారంభించిన 12 రోజులకే ఆయన తన 10 శాతం వాటాను 800 డాలర్లకు అమ్మేసి బయటకు వెళ్లిపోయారు.

ఎక్స్ ఖాతాకో ప్రత్యేకం..

తన ఉత్పత్తులు, ఈవెంట్లను ఈ కంపెనీ తన ఎక్స్ ఖాతాలో ప్రచారం చేస్తుంది. కానీ ఆ పోస్టులు యాపిల్ ప్రొఫైల్‌లో కనిపించవు. వాటిని డార్క్ ట్వీట్ల రూపంలో పోస్ట్ చేస్తుంది. టైమ్‌లైన్‌లో ప్రకటనలుగా మాత్రమే కనిపిస్తాయే తప్ప యాపిల్ ప్రొఫైల్‌లో ఉండవు.

యాడ్‌లలో 9:41 ఎందుకంటే?

కంపెనీ విడుదల చేసే ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌బుక్‌లలో సమయం ఎప్పుడూ ఉదయం 9:41 గంటలనే సూచిస్తుంటుంది. 2007లో జరిగిన మొదటి ఐఫోన్ లాంచ్



ఈవెంట్ ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. దానికి సంబంధించిన విషయాలను చర్చించడానికి 42 నిమిషాలు పడుతుందని భావించారు. ఐఫోన్‌ను రివీల్ చేసే సమయానికి వినియోగదారుల గడియారాల్లో ఉన్న సమయమే ఫోన్‌లోనూ చూపించాలని ప్లాన్ చేశారు. అందుకే మొదట ఫోన్ స్క్రీన్‌పై సమయం ఉదయం 9:42 గంటలుగా సెట్ చేశారు. అయితే, దీనికి ఒక నిమిషం ముందే ఐఫోన్‌ను ఆవిష్కరించడంతో స్క్రీన్‌పై ఆ సమయాన్ని 9:41కి మార్చారు. అప్పటి నుంచి ప్రతి మోడల్‌కు సంబంధించిన యాడ్‌లో ఇదే టైం కన్పిస్తోంది. కాగా.. యాపిల్ వాచ్‌కు మాత్రం దీని నుంచి మినహాయింపు ఉంది.

ఆన్ చేసినప్పుడు కింద కనిపించేవి రంగుల బబుల్ గ్రాఫిక్స్ మాత్రమే కాదు.. మీరు మాట్లాడేటప్పుడు మీ వాయిస్ ఫ్రీక్వెన్సీ, పిచ్ ఆధారంగా ఆ రంగుల తరంగాలు కదులుతాయి. ఇక, Siri అనే వాయిస్ అసిస్టెంట్‌ను యాపిల్ సొంతంగా తయారుచేసింది కాదు. 2010లో ఒక స్వతంత్ర యాప్‌గా ఉన్న సిరిని ఈ సంస్థ కొనుగోలు చేసింది. ఐఫోన్ 4ూ నుంచి తమ ఫోన్లలో అంతర్భాగంగా మార్చింది.

విలన్లకు ఐఫోన్లు ఉండవు

హాలీవుడ్ లేదా ఇతర సినిమాల్లో నటించే విలన్లు సినిమాల్లో ఐఫోన్ ఉపయోగించకుండా యాపిల్ కఠినమైన నిబంధనలు విధించింది. సినిమాల్లో పాజిటివ్ పాత్రలకే స్క్రీన్‌పై ఐఫోన్ వాడటానికి అనుమతి ఉంటుంది.

14 ఏళ్లు ఆ యాప్ లేకుండా...

ఐప్యాడ్ విడుదలైనప్పటి నుంచి దాదాపు 14 ఏళ్ల వరకు అందులో క్యాలిక్యులేటర్ యాప్ లేదట. యాప్ డిజైన్ ప్రాజెక్ట్‌గా లేదని స్టీవ్ జాబ్స్ ఓసారి దాన్ని తిరస్కరించారు కూడా. ఇటీవలే ఐప్యాడ్ ఓఎస్18లో దీన్ని తీసుకొచ్చారు

అప్‌స్టాక్స్‌తో యూఎస్ స్టాక్స్

8,000 కంపెనీల షేర్ల కొనుగోలుకి వీలు
2,000 ఈటీఎఫ్‌లలోనూ పెట్టుబడికి ఓకే

న్యూఢిల్లీ: దేశీ ఇన్వెస్టర్లు యూఎస్ స్టాక్స్ కొనుగోలు చేసేందుకు వీలుగా అప్‌స్టాక్స్ సొంత ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. దీంతో యూఎస్‌లో లిస్టయిన 8,000కుపైగా కంపెనీల షేర్ల కొనుగోలుకి వీలు చిక్కనుంది. అంతేకాకుండా మరో 2,000 ఎక్ట్సేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్‌లు)లోనూ ఇన్వెస్ట్ చేయవచ్చని ఒక ప్రకటనలో స్టాక్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ అప్‌స్టాక్స్ తెలియజేసింది. యాప్ ద్వారా గ్లోబల్ దిగ్గజాలు యాపిల్, టెస్లా, అమెజాన్, గూగుల్ తదితర షేర్లను సొంతం చేసుకోవచ్చని తెలియజేసింది. దీనిలో భాగంగా ఇన్వెస్టర్లు కనీసం 1 డాలరుతో పెట్టుబడులు ప్రారంభించవచ్చని వెల్లడించింది. తద్వారా పూర్తి షేరుని కాకుండా దీనిలో కొంత భాగాన్ని సైతం కొనుగోలు చేయవచ్చని వివరించింది. అంతర్జాతీయ మార్కెట్లో పెట్టుబడులు దేశీ వెల్త్ ఎకోసిస్టమ్ తదుపరి దశ వృద్ధిని ప్రతిబింబిస్తాయని అప్‌స్టాక్స్ సహవ్యవస్థాపకుడు, సీఈవో రవి కుమార్ పేర్కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా గ్లోబల్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చని తెలియజేశారు.

పెట్టుబడులు ఇలా

వినియోగదారులు తమ దేశీ బ్యాంక్ ఖాతాల ద్వారా రూపాయలలోనే పెట్టుబడులు చేపట్టవచ్చని అప్‌స్టాక్స్ పేర్కొంది. ఇవి ఆటోమేటిగ్గా డాలర్లలోకి మారి?పడి అవుతాయని తెలియజేసింది. ఇన్వెస్టర్లు యూఎస్ మార్కెట్ల




ట్రేడింగ్ సమయంకానప్పుడు కూడా ఆఫ్టర్ మార్కెట్ ఆర్డర్ల ద్వారా కొనుగోలు ఆర్డర్లు నమోదు చేయవచ్చని వివరించింది. స్పేస్ ఎక్స్‌ప్లొరేషన్, ఏఐతోపాటు.. ఇతర వర్ధమాన టెక్నాలజీలు, ఇతర రంగాలలో పెట్టుబడులకు యూఎస్ స్టాక్స్ వీలు కలి?పస్తాయని పేర్కొంది. ఆర్‌బీఐ అనుమతించిన ఎల్ఆర్ఎస్ ద్వారా మార్గదర్శకాలకు లోబడి ఇందుకు అవకాశముంటుందని తెలియజేసింది.

లబూషేన్‌కు ఆఖరి అవకాశం..
టెస్టు స్క్వాడ్‌లో టీ20 సంచలనం!

ఇటీవల ఫామ్ లేమితో విమర్శలు ఎదుర్కొంటున్న మార్నస్ లబూషేన్‌కు మరో అవకాశం దక్కింది. స్వదేశంలో బంగ్లాదేశ్‌పై తీవ్రంగా నిరాశపరిచిన అతడిపై వేటు వేయాలనే డిమాండ్లు వస్తున్నా సరే సెలెక్టర్లు నమ్మకం ఉంచారు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు లబూషేన్‌ను తీసుకున్నారు. అలానే.. ఓపెనర్‌గా మాథ్యూ రెన్‌షా చోటు దక్కించుకోగా.. టీ20ల్లో మెరుస్తున్న కూపర్ కొన్నోల్లీకి అవకాశం లభించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ 2025-27)లో మరో కీలకమైన సిరీస్ కోసం ఆస్ట్రేలియా స్క్వాడ్‌ను ప్రకటించింది. గత సీజన్ విజేత దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌లకు పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. 2018 తర్వాత తొలిసారి సఫారీ గడ్డపై పర్యటించనున్న ఆసీస్ ఇన్నింగ్స్‌ను ట్రావిస్ హెడ్‌కు జతగా మాథ్యూ రెన్‌షా ఆరంభించే అవకాశముంది. ఆశ్చర్యంగా మిడిలార్డర్ బ్యాటర్ మార్నస్ లబూషేన్ వేటు తప్పించుకున్నాడు. స్వదేశంలో ఇటీవల బంగ్లాదేశ్‌పై మూడు ఇన్నింగ్స్‌లో 1, 13, 4 పరుగులతో విమర్శలపాలైన అతడికి చివరి అవకాశంగా స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. గత మూడేళ్లుగా.. 41 ఇన్నింగ్స్‌ల్లో ఒక్క శతకం కూడా చేయని లబూషేన్ సఫారీలపై రాణిస్తే సరి. లేదంటే.. అతడి కెరీర్ ప్రమాదంలో పడినట్టే.

రెండో స్పిన్నర్..

టీ20ల్లో విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడుతున్న కూపర్ కొన్నోల్లీని టెస్టులకు సిద్ధం చేయాలనుకుంటున్న ఆస్ట్రేలియా క్రికెట్ అతడిని సఫారీ సిరీస్‌కు ఎంపిక చేసింది. ఇక బౌలింగ్ యూనిట్‌లో పెద్దగా మార్పులేమీ చేయలేదు సెలెక్టర్లు. కమిన్స్



నేతృత్వంలోని పేస్ దళంలో స్టార్క్, బోలాండ్, నాసిర్, హేజిల్‌వుడ్ ఉండగా.. లియాన్‌కు తోడుగా కుహ్నేమన్ రెండో స్పిన్నర్‌గా స్క్వాడ్‌లో స్థానం సాధించాడు. డబ్ల్యూటీసీలో కీలకమైన మూడు టెస్టుల సిరీస్ కోసం ఆస్ట్రేలియా అక్టోబర్‌లో దక్షిణాఫ్రికా వెళ్లనుంది. డర్బన్‌లోని కింగ్స్‌మీడ్ స్టేడియంలో అక్టోబర్ 9వ తేదీన మొదటి మ్యాచ్‌తో సిరీస్ మొదలవ్వనుంది. అక్టోబర్ 18న రెండో మ్యాచ్, 27న మూడో టెస్టులో సఫారీలతో కమిన్స్ సారథ్యంలోని ఆసీస్ తలపడనుంది. ఆస్ట్రేలియా స్క్వాడ్ : మాథ్యూ రెన్‌షా, ట్రావిస్ హెడ్, మాథ్యూ కుహ్నేమన్, మార్నస్ లబూషేన్, స్టీవ్ స్మిత్, జోష్ ఇంగ్లిస్, కూపర్ కొన్నోల్లీ, కామెరూన్ గ్రీన్, బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ క్యారీ(వికెట్ కీపర్), ప్యాట్ కమిన్స్(కెప్టెన్), మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్, స్కాట్ బోలాండ్, మైఖేల్ నాసిర్, లియాన్.

స్పోర్ట్స్

ఇషాన్ రికార్డు డబుల్ సెంచరీ..
ఎట్టకేలకు ఈస్ట్ జోన్ ఆలౌట్..!



దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్(270) రికార్డు ద్విశతకంతో రెచ్చిపోయాడు. తొలి రోజే సెంచరీతో జట్టుకు భారీ స్కోరందించిన ఇషాన్.. రెండో రోజూ విధ్వంసాన్ని కొనసాగించాడు. కుమార కుషగ్ర (101)తో రెండొందలకు పైగా భాగస్వామ్యం నెలకొల్పాడు. ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(72), శిఖర్ మోహన్(85)లు కూడా దంచేయడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ 708 పరుగులు వద్ద ఆలౌటైంది. దులీప్ ట్రోఫీ టైటిల్ పోరులో ఈస్ట్ జోన్ జట్టు భారీ స్కోర్ కొట్టింది. తొలిరోజే సౌత్ జోన్ బౌలర్లను వణికిస్తూ ఇషాన్ కిషన్(270: 334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్సర్లు) మరింత భయపెట్టాడు. తొలి రోజే సెంచరీతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో పదోసారి మూడంకెల స్కోరందుకున్న ఇషాన్.. రెండో రోజూ రెచ్చిపోయాడు. ఓవర్‌నైట్ స్కోర్ 385/4తో ఆట మొదలెట్టిన జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. సౌత్ బౌలర్ల వ్యూహాలను చిత్తు చేసిన ఈ చిచ్చరపిడుగు.. కుమార కుషగ్ర(101)తో కలిసి స్కోర్‌బోర్డును ఉరికించాడు. ఈ క్రమంలోనే దులీప్ ట్రోఫీ ఫైనల్లో డబుల్ సెంచరీ సాధించాడు ఇషాన్. తద్వారా టైటిల్ పోరులో ద్విశతకం బాదిన ఐదో ఆటగాడిగా అతడు రికార్డు నెలకొల్పాడు.

తొలిరోజు 385/4

చిదంబరం స్టేడియంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ చెలరేగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జట్టుకు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(72), వైభవ్ సూర్యవంశీ(44)లు శుభారంభమిచ్చారు. సిరాజ్, మిలింద్ వంటి బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న వైభవ్ తొలి వికెట్‌కు వంద రన్స్ జోడించాడు. వైభవ్ అర్ధ శతకం చేజార్చుకోగా.. ఈశ్వరన్ ఫిఫ్టీతో మెరిశాడు. ఆపై శిఖర్ మోహన్(85) ధనాధన్ ఆడాడు. లంచ్ తర్వాత నుంచి ఇషాన్, కుషగ్రలు సౌత్ బౌలర్లను విసిగిస్తూ క్రీజులో పాతుకుపోగా తొలి రోజు ఆట ముగిసే సరికి ఈస్ట్ 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

పాక్‌లో భారత జట్ల పర్యటనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..!

పాకిస్తాన్‌లో వచ్చే ఏడాది జరగనున్న సౌత్ ఏషియన్ ఫెడరేషన్ (ూూఖీ) గేమ్స్‌కు భారత్ తమ బృందాన్ని పంపేందుకు సమ్మతి తెలిపినట్లు ఆ దేశ మీడియా చెప్పుకుంటుంది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. గతేడాది పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య సంబంధాలు మరింత దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో పాకిస్తాన్‌లో జరిగే క్రీడా పోటీలకు భారత బృందం నిజంగానే వెళ్తుందా అని భారతీయులు చర్చించుకుంటున్నారు. ూూఖీ గేమ్స్‌లో పాల్గొనేందుకు భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పాకిస్తాన్ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఖాలిద్ మెహమూద్ వెల్లడించినట్లు 'ది న్యూస్ పాకిస్తాన్' అనే వార్తా సంస్థ పేర్కొంది. ది న్యూస్ పాకిస్తాన్ కథనం ప్రకారం.. దక్షిణాసియా ఒలింపిక్ అసోసియేషన్‌కు సంబంధించిన



ఉన్నతస్థాయి సమావేశంలో భారత్‌కు ప్రాతినిధ్యం ఉందని మెహమూద్ తెలిపారు. భారత్ నుంచి ఎంత మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారు.. ఏయే క్రీడాంశాల్లో బరిలోకి దిగుతారు.. అనే వివరాలు వచ్చే ఏడాది జనవరిలో వెల్లడించే అవకాశం ఉందని ఆయన అన్నారు. ూూఖీ గేమ్స్‌లో క్రికెట్, హాకీ సహా 28 క్రీడాంశాలు ఉంటాయి. భారత హాకీ జట్టు చివరిగా 2006లో పాక్‌లో పర్యటించగా.. భారత క్రికెట్ జట్టు చివరిగా 2008లో పాక్‌లో పర్యటించింది.



చిరంజీవి-వశిష్ఠ ఇద్దరూ వేరే ప్రాజెక్టులతో బిజీ

'విశ్వంభర' రిలీజ్‌పై కొనసాగుతున్న సస్పెన్స్!

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు వశిష్ఠ కాంబినేషన్‌లో తెరకెక్కిన భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'పై మరోసారి చర్చ మొదలైంది. భారీ అంచనాలతో తెరకెక్కిన ఈ సినిమా విడుదల విషయంలో ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో మెగా అభిమానుల్లో ఆసక్తితో పాటు కొంత అయోమయం కూడా నెలకొంది. ఒకవైపు చిరంజీవి తన తదుపరి ప్రాజెక్టులతో బిజీగా ఉంటే.. మరోవైపు దర్శకుడు వశిష్ఠ కూడా తన కొత్త సినిమాను అధికారికంగా ప్రకటించారు. చిరంజీవి-వశిష్ఠ కాంబినేషన్‌లో వచ్చిన 'విశ్వంభర'ను మొదటి నుంచే భారీ స్థాయిలో తెరకెక్కించారు. సోషియో ఫాంటసీ కథాంశంతో రూపొందిన ఈ చిత్రంపై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే విడుదలైన సినిమా ప్రచార కంటెంట్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా చిరంజీవిని ఫాంటసీ ప్రపంచంలో సరికొత్తగా చూపించబోతున్నారనే ప్రచారం సినిమాపై హైప్‌ను పెంచింది.అయితే ఈ సినిమా తొలుత 2025 జనవరిలో ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. వివిధ కారణాలతో విడుదల వాయిదా పడింది. అనంతరం 2026 సమ్మర్‌లో విడుదల చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ.. ఆ షెడ్యూల్ కూడా కార్యరూపం దాల్చలేదు.ప్రస్తుతం చిరంజీవి తన తదుపరి చిత్రం 'కాకా' కీలక షెడ్యూల్‌లో బిజీగా ఉన్నట్లు సమాచారం. దీంతో 'విశ్వంభర' కంటే ఆయన ఫోకస్ ప్రస్తుతం కొత్త ప్రాజెక్ట్‌పై ఉన్నట్లు కనిపిస్తోంది. మరోవైపు దర్శకుడు వశిష్ఠ కూడా ఇప్పటికే నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞతో తన తదుపరి సినిమాను ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌పై కూడా ఇండస్ట్రీలో ఆసక్తి నెలకొంది.దీంతో ఒకే కాంబినేషన్‌లో మొదలైన 'విశ్వంభర' ప్రయాణంలో హీరో, దర్శకుడు ఇద్దరూ తమ తదుపరి ప్రాజెక్టుల వైపు వెళ్లిపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇదే ఇప్పుడు మెగా అభిమానులను వేధిస్తున్న ప్రధాన ప్రశ్న. గతంలో 'విశ్వంభర'ను అక్టోబర్ మధ్యలో విడుదల చేసే అవకాశం ఉందనే టాక్ వినిపించింది. అయితే ఇప్పటివరకు దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాలేదు.దీంతో సినిమా నిజంగా ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందనే విషయంలో క్లారిటీ లేకుండా పోయింది. ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడటంతో అభిమానులు అధికారిక అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్నారు.

8 ఏళ్ల తర్వాత వస్తున్న సినిమాపై భారీ అంచనాలు

బాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి బిపాసా బసు మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. ఇప్పుడు ఓ విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. దాదాపు ఎనిమిదేళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత బిపాసా బసు నటిస్తున్న కొత్త సినిమాపై బాలీవుడ్‌లో ఆసక్తి నెలకొంది. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న పీరియడికల్ క్రైమ్ థ్రిల్లర్ 'బారాబంకి' లో బిపాసా బసు కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. క్రైమ్, డ్రామా అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. అందుతున్న సమాచారం ప్రకారం 'బారాబంకి' కథ 1984లో చోటుచేసుకున్న ఓ యథార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఆ కాలం నాటి పరిస్థితులు, నేర నేపథ్యం, మానవ సంబంధాలను మేళవిస్తూ హన్సల్ మెహతా ఈ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. పీరియడిక్ బ్యాక్‌డ్రాప్‌లో క్రైమ్, డ్రామాను మిళితం చేస్తూ సినిమాను తెరకెక్కిస్తున్న నేపథ్యంలో.. హన్సల్ మెహతా మార్క్‌లో ఉండే రియలిస్టిక్ మేకింగ్ కనిపించనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. 'బారాబంకి'లో బిపాసా బసుతో పాటు యువ నటులు సన్నీ కౌశల్, విశాల్ జేత్వా కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ హీరోయిన్ బిపాసా అనుభవంతో పాటు యువ నటుల ఎనర్జీ, హన్సల్ మెహతా విభిన్నమైన టేకింగ్ కలిసి ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచుతున్నాయి. అయితే బిపాసా పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం చిత్రబృందం ప్రస్తుతానికి వెల్లడించలేదు. కథలో ఆమె పాత్ర కీలక మలుపులకు కారణమవుతుందా? లేక కథను నడిపించే ప్రధాన పాత్రలో కనిపిస్తారా? అనేది సినిమా విడుదలకు దగ్గరయ్యే కొద్దీ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. బిపాసా బసు చివరిసారిగా 'అలోన్' సినిమాలో హీరోయిన్‌గా కనిపించారు. ఆ తర్వాత ఆమె సినిమాలకు దూరంగా ఉంటూ వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. 2016లో నటుడు కరణ్ సింగ్ గ్రోవర్‌ని వివాహం చేసుకున్న బిపాసా.. ఆ తర్వాత కుటుంబ జీవితంలో బిజీ అయ్యారు. 2022లో ఈ దంపతులకు కుమార్తె జన్మించింది. మాతృత్వాన్ని పూర్తిగా ఆస్వాదించేందుకు బిపాసా సినిమాలకు మరింత దూరంగా ఉన్నారు.ఈ కారణంగా ఆమెను వెండితెరపై మళ్లీ చూడాలని అభిమానులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు 'బారాబంకి'తో బిపాసా రీ-ఎంట్రీ ఇస్తున్నారనే వార్త వారిలో మరింత ఆసక్తిని పెంచుతోంది.




రకుల్ ప్రీత్ సింగ్ రీ-ఎంట్రీకి రెడీనా..

ఏడాదిన్నర తర్వాత మళ్లీ జిమ్‌లోకి, అసలు కారణం ఇదే!

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల కెరీర్‌కు ఎప్పుడు బ్రేక్ వస్తుందో చెప్పడం కష్టం. ఒకప్పుడు వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్లుగా వెలిగిన వారు.. ఆ తర్వాత ఒక్కసారిగా సినిమాలకు దూరమై ప్రేక్షకులకు కనిపించకుండా పోతుంటారు. ప్రస్తుతం యంగ్ హీరోయిన్ల హవా కొనసాగుతుండటంతో పలువురు సీనియర్ హీరోయిన్లకు అవకాశాలు తగ్గుతున్నాయి. కొందరు పెళ్లి చేసుకుని కుటుంబ జీవితంలో స్థిరపడుతుండగా.. మరికొందరు బిజినెస్, ఇతర రంగాలపై ఫోకస్ పెడుతున్నారు. ఇదే సమయంలో ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ పేరు మరోసారి వార్తల్లోకి వచ్చింది. సినిమాలకు కొంతకాలంగా దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. దాదాపు ఏడాదిన్నర తర్వాత మళ్లీ స్ట్రెంత్ ట్రైనింగ్ వర్కౌట్స్ ప్రారంభించారు.

జిమ్‌లో కష్టపడుతున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో.. రకుల్ మళ్లీ సినిమాల్లోకి రాబోతున్నారా? అనే చర్చ మొదలైంది.రకుల్ ప్రీత్ సింగ్‌కు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. కాలేజీ రోజుల్లోనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన ఆమె.. 2009లో కన్నడ చిత్రం 'గిల్లి'తో హీరోయిన్‌గా సినీ ప్రయాణం ప్రారంభించారు. ఆ తర్వాత తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'కెరటం' సినిమాతో పరిచయమైన రకుల్.. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' తో మంచి విజయాన్ని అందుకుని ఒక్కసారిగా టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా మారారు. అనంతరం పలువురు స్టార్ హీరోల సరసన నటించి వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకున్న రకుల్.. టాలీవుడ్‌లో అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించారు. తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ సినిమాలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్.. ప్రస్తుతం హిందీ చిత్రాలపై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో తన వ్యక్తిగత జీవితంలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.తాను ప్రేమించిన బాలీవుడ్ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీని రకుల్ వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత వ్యక్తిగత జీవితానికి కూడా సమయం కేటాయిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.అయితే కొంతకాలంగా ఆమె సినిమాల్లో పెద్దగా కనిపించకపోవడంతో అభిమానులు రకుల్ కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే గతంలో తీవ్రమైన నడుము నొప్పి కారణంగా ఆమె కొంతకాలం విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. దీంతో వర్కౌట్స్‌కు కూడా దూరంగా ఉన్నారు.తాజాగా దాదాపు ఏడాదిన్నర విరామం తర్వాత మళ్లీ స్ట్రెంత్ ట్రైనింగ్ ప్రారంభించారు. నడుముకు బెల్ట్ ధరించి జిమ్‌లో కసరత్తులు చేస్తున్న వీడియోను రకుల్ షేర్ చేశారు. వైద్యుల సలహా మేరకు సేఫ్టీ గేర్‌తో మళ్లీ వర్కౌట్స్ మొదలుపెట్టినట్లు ఆమె వెల్లడించినట్లు సమాచారం.



'రణబాలి' టీజర్ అప్‌డేట్ వచ్చేసింది

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక జంటగా నటిస్తున్న చిత్రం 'రణబాలి'. రాహుల్ సాంకృత్యాయన్ దర్శకుడు. వీరిద్దరి పెళ్లి చేసుకున్న తర్వాత కలిసి చేసిన తొలి సినిమా ఇదే కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 16 ఈ సినిమా విడుదల కానుంది. ఈ క్రమంలో సెప్టెంబర్ 9న టీజర్ విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. కాగా ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతుండగా.. విజయ్ ఇందులో యోధుడి పాత్రలో కనిపించనున్నాడు. అజయ్, అతుల్ సంగీతం అందిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999